## ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 34, పేజీలు - 08

గురువారం, జులై 30, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# తెలంగాణ ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు క్లియరెన్స్

- పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్‌కు గ్రీన్ సిగ్నల్!
- చట్టబద్ధతపై కోర్టు కీలక వ్యాఖ్యలు
- సాగునీటి ప్రాజెక్టులకు పూర్తి రక్షణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తుపై నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు సుప్రీంకోర్టులో అత్యంత భారీ ఊరట లభించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్, గౌరవెల్లి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్లపై దేశ సర్వోన్నత న్యాయస్థానం గురువారం సంచలన తీర్పు వెలువరించింది. వివాదాస్పద పర్యావరణ అనుమతుల అమలుకు అడ్డంకులు తొలగిపోవడంతో, రాష్ట్రంలో వేలాది ఎకరాలకు సాగునీరు మరియు కోట్లాది మందికి తాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనులకు దారి సుగమమైంది.

### అనుమతులన్నీ చెల్లుబాటు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 2021 నాటి కేంద్ర పర్యావరణ శాఖ కార్యనిర్వాహక మెమోరాండం ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. అయితే, గతంలో ఆ మెమోరాండం ఆధారంగా మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులో ఉంటాయని ధర్మాసనం స్పష్టమైన తీర్పునిచ్చింది. ఈ కీలక నిర్ణయంతో తెలంగాణ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి నిర్మాణాలు పూర్తి చట్టబద్ధమైన రక్షణను పొందినట్లయింది. న్యాయస్థానాల ఆదేశాల కారణంగా ఇన్నాళ్లూ పనుల్లో అడ్డంకులు ఎదుర్కొన్న ఈ ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు ఆదేశాలు కొత్త ఊపిరి పోశాయి. ఈ తీర్పు కేవలం భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులకు మాత్రమే వర్తిస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న కీలక ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ముప్పు లేదని తేల్చిచెప్పడంతో, రాష్ట్రవ్యాప్తంగా పనులు నిలిచిపోయిన రిజర్వాయర్లు, కెనాళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం కానుంది.

### ఆఫీస్ మెమోరాండమ్‌లతో ఆపలేరు!

తీర్పు సందర్భంగా పర్యావరణ పరిరక్షణ , చట్టాల అమలుపై సీజేఐ ధర్మాసనం అత్యంత కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం ఆఫీస్ మెమోరాండమ్‌లు లేదా కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టాలను రూపుమాపడం లేదా భర్తీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ముందస్తు

2లో..

విద్యార్థులపై కాల్పులు జరిపించింది

# హోంమంత్రే

- లోక్‌సభలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్రంగా స్పందించింది. ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సభలో ఈ వాగ్వాదం చోటుచేసుకుంది. భారత విద్యావ్యవస్థ ఆర్ఎస్ఎస్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి కేవలం నామమాత్రంగానే ఉన్నారని, తెరవెనుక అసలు వ్యవస్థను నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్సేనని ఆయన విమర్శించారు. "ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ఒక ప్రతీక మాత్రమే. మన విద్యార్థులకు అసలైన శత్రువు ఆర్ఎస్ఎస్" అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థులు జ్ఞానం, సత్యాల దిశగా పయనించకుండా ఆర్ఎస్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

2లో..

# పార్టీ బలోపేతమే లక్ష్యం

- ఢిల్లీలో టీపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీలోని ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యాలయమైన ఇందిరా భవన్‌లో ప్రతిష్టాత్మక టీపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన ఈ ముఖ్యాంశాల భేటీలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పాలన పార్టీ సంస్థాగత బలోపేతంపై అత్యంత కీలకమైన చర్చలు జరిగాయి.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. వారితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు దామోదర రాజనర్సింహ, ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దానసరి అనసూయ (సీతక్క), ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితర ముఖ్య నేతలందరూ హాజరయ్యారు.
సమావేశం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంపై విస్తృతంగా చర్చించారు. పార్టీ కార్యక్రమాలను

2లో..

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వ ప్రమాదం

- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం

2లో..

# ఏపీలో పెట్టుబడులకు తైవాన్ ఆసక్తి

- సీఎం చంద్రబాబుతో దిగ్గజ కంపెనీల ప్రతినిధుల భేటీ

- ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ రంగాలపై ప్రధానంగా చర్చలు
- రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి
- ఏపీ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై కీలక ఒప్పందాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపాయి. ఈ మేరకు తైవాన్ పారిశ్రామిక ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ లతో వేర్వేరుగా సమావేశమైంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అధునాతన తయారీ రంగాల్లో ఏపీతో భాగస్వామ్యం పెంచుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీటీబీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, శాండ్ సన్, జిలీ కన్‌స్ట్రక్షన్స్ వంటి పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు అందుబాటులో ఉన్న సానుకూల వాతావరణాన్ని వారికి వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, విమానాశ్రయాలు, పటిష్టమైన రోడ్డు, రైలు మార్గాల ద్వారా బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రాష్ట్రం కలిగి ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులు, పూర్తిస్థాయి ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. భారత్‌లో తమ దేశ సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు విస్తరించేందుకు గల అవకాశాలను

2లో..

# ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్

- కుంకీ శిబిరాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఉత్తరాంధ్రలో ఏళ్ల తరబడి రైతులను, ప్రజలను భయపెడుతున్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ-అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ప్రారంభించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ శిబిరం ఏర్పాటు ఉత్తరాంధ్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన అభివర్ణించారు. సీతానగరం మండలం గుచ్చిమి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ప్రకృతి మనది కాదు, మనమే ప్రకృతిలో భాగం. కాబట్టి దానితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే సుస్థిర ప్రగతి సాధ్యమవుతుంది" అని అన్నారు.పార్వతీపురం మన్యం జిల్లాలో అడవుల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి రావడం, రైతుల పంటలను నాశనం చేయడం, రాత్రిపూట

2లో..

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

- యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నీట్, జేఈఈ వంటి పబ్లిక్ పరీక్షల్లో జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అక్రమాల నిరోధక) సవరణ బిల్లు, 2026' (యాంటీ పేపర్ లీక్ బిల్లు)కు లోక్ సభ తాజాగా ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో యాంటీ పేపర్ లీక్ బిల్లుకు ఆమోదం తెలిపింది. రెండు రోజుల పాటు ఈ బిల్లుపై వాడీవేడీగా చర్చలు జరిగాయి. అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదంతో లోక్ సభలో ఒకింత గందరగోళం నెలకొంది. చర్చ అనంతరం మూజువాణి ఓటుతో బిల్లుకు లోక్ సభ ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు లోక్ సభ

2లో..

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర

- 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎప్పుడెప్పుడు పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల అవుతుందా అని ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) మొత్తం 7,437 పోస్టుల భర్తీ చేపట్టనుంది. ఇందుకోసం నాలుగు నోటిఫికేషన్లను తాజాగా విడుదల చేసింది. ఈ నియామకాల ద్వారా పోలీసు

2లో..

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్

- ఉప్పరపల్లి కోర్టు తీర్పు, చంచల్‌గూడ జైలుకు తరలింపు!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న వివాదాస్పద ట్రైనీ ఐపీఎస్ అధికారి ఎన్. ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఆయనను రాజేంద్రనగర్ పరిధిలోని ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆగస్టు 11 వరకు 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ కీలక తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల అనంతరం ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.

2లో..

## పని మాది.. ప్రచారం చంద్రబాబుది

- భోగాపురం విమానాశ్రయంపై సీఎం జగన్ రియాక్షన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** భోగాపురం విమానాశ్రయాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగ దారులు వెతుకుతున్నారని, కిరీటం వేసుకోవడంలో ఆయన చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపరని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

2లో..

సంక్షేమ పథకాలకు, ఓటర్ల జాబితా

## సవరణకు సంబంధం లేదు

- ఎస్ఐఆర్ పై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ఏకైక లక్ష్యమని ఆయన వివరించారు. బుధవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఫారాల సమర్పణకు మరో ఐదు రోజులే గడువు ఉన్నందున, ఆగస్టు 3వ తేదీ నాటికి

2లో..

# తెలంగాణ ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు క్లియరెన్స్

పర్యావరణ అనుమతులు లేని ఏ నూతన ప్రాజెక్టుకూ పర్యావరణ రక్షణ చట్టాలకు విరుద్ధంగా మినహాయింపులు లేదా అనుమతులు మంజూరు చేయడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

### తెలంగాణకు ఎంతో మేలు

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పుపై తెలంగాణ ప్రజలు, ము ఖ్యంగా మహబూబ్‌నగర్, రంగా రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట ప్రాంతాల రైతాంగం తీవ్ర హర్షం వ్యక్తం చేస్తోంది. పర్యావరణ అనుమతుల వివాదం శాశ్వతంగా ముగియడంతో, నిధుల సమీకరణను వేగవంతం చేసి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు నీటిపారుదల శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ తీర్పుతో తెలంగాణ సాగునీటి రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది.

# విద్యార్థులపై కాల్పులు జరిపించింది హోంమంత్రే

కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. నీట్ అవకతవకలకు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జూలై 20న విద్యార్థులు చేపట్టిన నిరసనపై జరిగిన పోలీసుల చర్యకు అమిత్ షానే బాధ్యుడని ఆయన ఆరోపించారు. "మన విద్యార్థులపై పెల్లెట్లు ప్రయోగించేందుకు హోంమంత్రే అనుమతి ఇచ్చారు. వారి శరీరాల్లోకి పెల్లెట్లు దిగేలా చేశారు" అని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్లమెంటును ఎదుర్కొనే ధైర్యం హోంమంత్రికి లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఈ ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం రాహుల్ సంయమనం పాటించాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేసేటప్పుడు కచ్చితమైన ఆధారాలు చూపాలని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. ఈ క్రమంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

# ఏపీలో పెట్టుబడులకు తైవాన్ ఆసక్తి

పరిశీలిస్తున్నామని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి.

### మంత్రి లోకేశ్ తో నైపుణ్యాభివృద్ధిపై చర్చలు

అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తో తైవాన్ ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రధానంగా మానవ వనరుల అభివృద్ధి, ఏపీ యువతకు నైపుణ్యాల కల్పనపై చర్చించారు. తైవాన్ తయారీ, సాంకేతిక రంగాల్లోని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతకు అవసరమైన శిక్షణ, ఉన్నత విద్యా భాగస్వామ్యంపై లోకేశ్ వారితో విస్తృతంగా మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడం, యువతకు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలపై కూడా చర్చలు జరిగాయి. ఏపీ, తైవాన్ మధ్య సంబంధాలలో ఈ సమావేశాలు ఒక కీలక మైలురాయిగా నిలవనున్నాయి. పారిశ్రామిక పెట్టుబడులతో పాటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వ ప్రమాదం

ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం

అన్ని జిల్లాల్లోనూ అత్యంత సమర్థవంతంగా అమలు చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా బాహుళ్యంలోకి మరింత వేగంగా తీసుకువెళ్లడమే ప్రధాన లక్ష్యంగా టీపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ వేదికగా నిర్ణయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, పాలనాపరమైన విజయాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించాలని సూచించారు.ప్రభుత్వానికి, పార్టీ యంత్రాంగానికి మధ్య మెరుగైన సమన్వయాన్ని ఏర్పరచడం ద్వారా రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత వేగంగా కృషి చేయవచ్చని నాయకులు అభిప్రాయపడ్డారు.ప్రజాసేవే పరమ మార్గంగా, తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతూ ముందుకు సాగేందుకు అందరూ కట్టుబడి ఉన్నామని సమావేశం అనంతరం నాయకులు స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణం మరియు భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనలో ఈ టీపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ మీటింగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్

ప్రజలు భయంతో జీవించడం వంటి సమస్యలు చాలాకాలంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతోనే 'గుచ్ఛిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియా'ను ఏర్పాటు చేశామని వివరించారు. గతంలో చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో 'జయంత్', 'అభిమన్యు' అనే కుంకీ ఏనుగులు అటవీ శాఖ అధికారులతో కలిసి అద్భుతంగా పనిచేశాయని తెలిపారు.

ఆధునిక టెక్నాలజీ సాయంతో అక్కడ ఏనుగుల దాడుల్లో మరణాలను 70 శాతానికి పైగా తగ్గించామని, పంట నష్టాన్ని కూడా గణనీయంగా నివారించామని పేర్కొన్నారు. మన్యం జిల్లాలోనూ అలాంటి విజయాన్నే సాధించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ శిబిరం కోసం నాలుగు కుంకీ ఏనుగులను పంపిన కర్ణాటక ప్రభుత్వానికి, ప్రజలకు పవన్ కల్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "ఏనుగులను బహుమతిగా ఇవ్వడాన్ని అక్కడి ప్రజలు తమ సంపదను పంచుకోవడంతో సమానంగా భావిస్తారు. ఇది వారి ఉదారతకు, స్నేహానికి నిదర్శనం. తెలుగు ప్రజల భద్రతపై ప్రేమతో ఏనుగులను పంపినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ఆయన అన్నారు. మానవులు, ఏనుగులు సామరస్యంగా సహజీవనం చేసేందుకు ఈ శిబిరం వేదికగా నిలుస్తుందని ఆశిస్తూ, దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

# పని మాది..ప్రచారం చంద్రబాబుది

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా జగన్ స్పందిస్తూ "2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు.

కానీ 2020లో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతీదీ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి" అని స్పష్టం చేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ.1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు.

కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు.

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

గురువారానికి వాయిదా వేసింది.యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్ సభలో దాదాపు 10 గంటలపాటు చర్చ జరిగింది. అధికార- ప్రతిపక్ష సభ్యులు ఈ బిల్లుపై ప్రసంగించారు. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగంపై సభలో ఒకింత గందరగోళం నెలకొంది. ఆయన ఇడియట్ వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. అలాగే విద్యాశాఖను ఆర్ఎస్ఎస్ నడుపుతోందని రాహుల్ గాంధీ కీలక ఆరోపణలు చేశారు. అంతేకాక ఈ సంస్థ విద్యార్థులను అంధభక్తులుగా మార్చాలని చూస్తోందని విమర్శించారు. అయితే రాహుల్ వ్యాఖ్యలపై అధికార పక్ష ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇక నీట్ పేపర్ లీక్ అంశం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. పేపర్ లీక్ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) పెద్ద ఉద్యమమే చేసింది. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దాదాపు నెల రోజుల పాటు నిరసనలు చేపట్టింది. ఈ ఆందోళనల్లో భాగంగా ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఇటీవల సీజేపీ ఆందోళనలు ఉద్ధృతం అయిన నేపథ్యంలో నీట్ పేపర్ లీక్ అంశానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ప్రహ్లాద్ జోషీకి కేంద్రం బాధ్యతలు అప్పగించింది. దాంతో సీజేపీ నిరసనలను విరమించుకుంది.

# తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర

శాఖ, ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్‌పీ), ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ తేదీలతోపాటు.. పరీక్షల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు పోలీస్ నియామక మండలి వెల్లడించింది. ఈ నోటిఫికేషన్‌లో 148 సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టులు.. 14 రిజర్వ్ ఎస్సై (ఏఆర్), 12 టీజీఎస్పీ ఎస్సైలు, 3 ఎస్ఏఆర్‌పీసీఎల్ ఎస్సై, 23 ఫింగర్ ప్రింట్ బ్యూరో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉన్నాయి. అలాగే కానిస్టేబుల్ విభాగంలో 3,697 సివిల్ కానిస్టేబుల్, 1,052 ఏఆర్ కానిస్టేబుల్.. 1,038 తెలంగాణ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్, 20 డ్రైవర్ (పీటీఓ), 7 మెకానిక్ పోస్టులను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు.ఫైర్ సర్వీసెస్ శాఖలో 39 స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 751 ఫైర్ ఫైటర్ పోస్టులు ఉండగా జైళ్ల శాఖలో 14 డిప్యూటీ జైలర్ (పురుషులు) ఒక డిప్యూటీ జైలర్ (మహిళ) 196 వార్డర్ (పురుషులు).. 12 వార్డర్ (మహిళలు) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ నోటిఫికేషన్‌తో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులకు మరో కీలక అవకాశం లభించింది. అర్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారిక నోటిఫికేషన్‌లో ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ లో తాజా సమాచారాన్ని పరిశీలిస్తూ దరఖాస్తు తేదీలు ప్రకటించిన వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అయితే భారీ ఎత్తున ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగ అభ్యర్థులు ఎదురుచూస్తుండగా 7437 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్

### ట్రైనీ మహిళా ఐపీఎస్ తీవ్ర ఆరోపణలు

పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టు ప్రకారం.. ఉదయ్‌కృష్ణారెడ్డిపై తోటి మహిళా ఐపీఎస్ అధికారిణి తీవ్రమైన ఆరోపణలు చేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ అయిన ఈ కేసు విచారణలో, నిందితుడు పలు మార్లు బాధితురాలిని లైంగికంగా వేధించాడని, అసభ్యకర మెసేజ్‌లు పంపడంతో పాటు తోటి అధికారుల వద్ద తీవ్రంగా అవమానించాడని తేలింది. ఆమె అనుమతి లేకుండా ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి, బెదిరింపులకు పాల్పడ్డాడని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పొందుపరిచారు.

### పరారీ అయ్యేందుకు ప్రయత్నం

ఈ కేసు దర్యాప్తులో ఉదయ్‌కృష్ణారెడ్డి పోలీసులకు ఏమాత్రం సహకరించలేదని, ఉద్దేశపూర్వకంగా అరెస్టు నుంచి తప్పించుకునేందుకు యత్నించారని రిమాండ్ నివేదిక స్పష్టం చేసింది. తన ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యేందుకు ప్రయత్నించడంతో పాటు, అదుపులోకి తీసుకునే సమయంలో అధికారులపై తిరుగబడ్డారని అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించారని విచారణాధికారులు వెల్లడించారు. నేర తీవ్రత దృష్ట్యా ఆయనకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తుడిచిపెట్టే లేదా బాధితురాలిని బెదిరించే అవకాశం ఉందని పోలీసులు కోర్టుకు వివరించారు.

### ఇప్పటికే సస్పెండ్ చేసిన ట్రైనింగ్ అకాడెమీ

కాగా, నేషనల్ పోలీస్ అకాడమీ అంతర్గత విచారణ కమిటీ కూడా ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అకాడమీలోని సిసిటివి ఫుటేజ్, డిజిటల్ ఆధారాలు పరిశీలించిన అనంతరం నిందితుడిపై నమోదైన ఆరోపణల్లో వాస్తవం ఉందని కమిటీ ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ అంతర్గత నివేదిక ఆధారంగా అకాడమీ యాజమాన్యం ఉదయ్‌కృష్ణారెడ్డిని ఇప్పటికే విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. సాధారణ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎంతో శ్రమించి ఐపీఎస్‌గా ఎంపికై సంచలనం సృష్టించిన ఉదయ్‌కృష్ణారెడ్డి ఇలా క్రిమినల్ కేసులో అరెస్ట్ అయి చంచల్‌గూడ జైలుపాలు కావడం పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. భారతీయ న్యాయ సంహిత, సమాచార సాంకేతిక చట్టం కింద నమోదైన పలు సెక్షన్ల ప్రకారం నిందితుడిపై దర్యాప్తు వేగవంతం చేశామని పోలీసులు వెల్లడించారు.

# సంక్షేమ పథకాలకు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధం లేదు

100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 90 శాతానికి చేరిందని తెలిపారు. ఖానాపూర్, బాలకొండ, ఎల్లారెడ్డి, హుజూర్‌నగర్, నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, బోథ్ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసిన అధికారులను ఆయన అభినందించారు.శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం వంటి పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. ఓటరు వివరాలను అప్‌లోడ్ చేసే సమయంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు), సూపర్‌వైజర్లు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరినీ ఒకే పోలింగ్ కేంద్రానికి కేటాయించాలని, అలాగే మరణించినా లేదా చిరునామా మారిన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేటప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సీఈఓ స్పష్టం చేశారు.

# రాష్ట్ర,హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి..

- వొడితల ప్రణవ్.. - కొండగట్టులో ఘనంగా గిరిప్రదక్షిణ.
- వర్షాలు సమృద్ధిగా కురవాలని,కొండగట్టు అంజన్నను మొక్కుకున్న ప్రణవ్..
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సాగిన గిరిప్రదక్షణ..

హుజురాబాద్ , రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని,రైతులకు ఎల్ నీ నో నుండి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని,నియోజవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కొండగట్టు అంజన్నను వేడుకున్నారు.

బుధవారం రోజున కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండగట్టు గిరిప్రదక్షణలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్,మున్నూరు కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు బొమ్మ శ్రీరామ్ హాజరయ్యారు.వర్షం సైతం లెక్కచేయకుండా,గిరి ప్రదక్షణ రోజే భారీవర్షం పడడంతో భక్తులు,కార్యకర్తలు ఆంజనేయ స్వామి అనుగ్రహం కలిగిందని,ఆ స్వామి నామస్మరణతో ప్రదక్షణ పూర్తిచేశారు.

అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అంజన్న అనుగ్రహం ప్రజలందరిపై,రైతులపై ఉండి,రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని,పాడి పంటలతో హుజూరాబాద్ నియోజకవర్గం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నీ నో పై వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే కౌశిక్ రెడ్డి మాత్రం కరువు కాంగ్రెస్ తెచ్చిందని మాట్లాడడం కౌశిక్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని,తానే శాస్త్రవేత్తలాగా మాట్లాడడం సిగ్గు చేటని,ప్రజలను ఇబ్బంది పెట్టేపనుల్లో బిఆర్ఎస్ నాయకులు మొదట ఉంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన

**సి.బెళగల్,** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండటంతో పాటు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సి.బెళగల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల రాజు సూచించారు. కర్నూలు జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో మహిళా పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ లోన్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే మోసాలను నమ్మి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే నకిలీ సందేశాలు, ఫేక్ అకౌంట్ల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. సమయానికి ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయని వివరించారు.మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం, పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, వేధింపులు, ఈవ్‌టీజింగ్, బెదిరింపులు లేదా ఇతర నేరాలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. మహిళల రక్షణకు అమలులో ఉన్న చట్టాలు, అత్యవసర సహాయ సేవల గురించి కూడా విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని ఎస్ఐ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, మహిళా పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

# బీజాపూర్ పోలీసుల ఎదుట 8 మంది నక్సలైట్ల లొంగుబాటు

**బీజాపూర్** ఛత్తీస్గఢ్లోని బీజాపూర్ జిల్లా పోలీసుల ఎదుట 49 లక్షల బహుమతి కలిగిన ఎనిమిది మంది కీలక నక్సలైట్లు లొంగిపోయారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వారు హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసినట్లు అధికారులు వెల్లడించారు.

# సింహాచలంలో గిరి ప్రదక్షిణ కోలాహలం

**– కిక్కిరిసిన గిరిమార్గం**

**విశాఖపట్నం** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక గిరి ప్రదక్షిణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోంది. ఈ పవిత్ర కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుంటున్నారు. సుమారు 32 కిలోమీటర్ల మేర సాగే ఈ గిరి ప్రదక్షిణలో భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా అడుగులు వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నీరు, ప్రసాదాలు మరియు వైద్య సదుపాయాలను విస్తృతంగా ఏర్పాటు చేశారు.

# అవసరం లేకున్నా కాంగ్రెస్ నేతలకు గన్ మెన్లు

**– బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్** మైనంపల్లి హన్మంతరావు ఏం కూంబింగ్ ఆపరేషన్లు చేశాడని, ఏ తీవ్రవాద సంస్థ, ఏ మావోయిస్టులు ఆయనను టార్గెట్ చేశారని 2+2 సెక్యూరిటీ ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీ ఎమ్మెల్సీ కాదు, కార్పొరేషన్ చైర్మన్ కాదు. ఆయనకు 2+2 సెక్యూరిటీ ఇచ్చారు.. ఆయనకు ఏ హోదా ఉందని 2+2 సెక్యూరిటీ ఇచ్చారని అయన నిలదీసారు.ఏనుముల తిరుపతి రెడ్డి, ఏనుముల కొండల్ రెడ్డిలు ఏం కూంబింగ్ ఆపరేషన్లు చేశారని, ఏ ఉగ్రవాద సంస్థతో ముప్పు ఉందని, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక సెమీ ఆటోమేటెడ్ వెపన్స్ ఇచ్చారు. నీతా మహేందర్ రెడ్డి మాజీ జెడ్పీ చైర్పర్సన్. ఆమెకు గన్మెన్లను ఇచ్చారు. సత్యవతి రాథోడ్ తెలంగాణ రాష్ట్రంలో తొలి గిరిజన మహిళా మంత్రి.. ఆమె ఇప్పుడు మాజీ మంత్రి. ఆమె గన్మెన్లను తీసేశారు. జోగు రామన్న మాజీ మంత్రి. ఆయన గన్మెన్లను తొలగించారు.. అదే జిల్లాలో ఇంద్రకరణ్ రెడ్డికి 2+2 గన్మెన్లను ఇచ్చారు ఎందుకని అన్నారు.కుందూరు జానారెడ్డి ప్రస్తుత హోదా ఏంటి? ఆయనకు 2+2 గన్మెన్లను ఇచ్చి, అత్యాధునిక బుల్లెట్ప్రూఫ్ వాహనం ఇచ్చారు.జానారెడ్డి మాజీ మంత్రి అయితే సత్యవతి రాథోడ్, జోగు రామన్న కూడా మాజీ మంత్రులే కదా. మరి వీళ్లకు ఎందుకు సెక్యూరిటీ తొలగించారు? బీఆర్ఎస్ నాయకులకు ఒక న్యాయం.. కాంగ్రెస్ నాయకులకు ఒక న్యాయమా? దీని మీద డీజీపీ సమాధానం చెప్పాలని అయన ఆన్నారు.

# మా కంటోన్మెంట్ వన్ టైమ్ ఎమ్మెల్యేకు ప్రతీ దాంట్లో కమిషన్లు కావాలి

**– బీఆర్ఎస్ క్రిశాంక్**

**సికింద్రాబాద్** మా కంటోన్మెంట్ వన్ టైమ్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు ప్రతి దాంట్లో కమిషన్లు కావాలి. తిరుమలగిరి చెరువు పని మేము మొదలుపెడితే, అక్కడికి ఈయన వెళ్లగానే పని ఆగిపోయింది. మేము కట్టించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కూడా అవినీతికి పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్ అరోపించారు.బాహుబలి సినిమాలో మాహిష్మతి సామ్రాజ్యం లాగా నిర్మించిన అల్వాల్ టిమ్స్ ఆసుపత్రి ఇంతవరకు ఎందుకు పూర్తి అవ్వడంలేదు? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోమటిరెడ్డి వెంకట రెడ్డి స్వయంగా టిమ్స్ ఆసుపత్రి పనులు 90% పూర్తయ్యాయని చెప్పాడు. 2028 వరకు పనులు పూర్తి చేయకూడదని నీకు రేవంత్ రెడ్డి చెప్పాడా? బీఆర్ఎస్ ప్రభుత్వం 90% పనులు పూర్తి చేసిన టిమ్స్ ఆసుపత్రి ఇప్పటి వరకు ఎందుకు పూర్తి అవ్వలేదో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. పోలీసులు కూడా మేము ఇక్కడి అనుమతి లేకుండా రావొద్దని అంటున్నారు. ఇది ప్రజల కోసం కట్టించిన ఆసుపత్రి, ఎవరైనా రావొచ్చు . పోలీసులకు కూడా నేను చెప్తున్నా, మళ్ళీ వచ్చేది మా ప్రభుత్వమే జాగ్రత్తగా ఉండండని అన్నారు.

# అగస్ట్ 1న మెగా జాబ్ మేళా ..

**– పోస్టర్ ఆవిష్కరణ**




**రాజమండ్రి** మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న రాజమహేంద్రవరం మంజీరా కన్వెన్షన్ సెంటర్లో జరిగే మెగా జాబ్ మేళా పోస్టర్ను మార్గాని ఎస్టేట్స్లో ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్ఫూర్తితో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జగన్ హయాంలో 1.20 లక్షల ఉద్యోగాలు కల్పించగా, తాను 10 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇది ఇప్పటికే మూడో మెగా జాబ్ మేళా అని, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఉద్యోగ అవకాశాల కల్పన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో ? 70 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయి. ? 2,000 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయి. వివిధ రంగాలలో అర్హులైన అభ్యర్థులకు స్పాట్లోనే అపాయింట్మెంట్ లెటర్లు అందజేయనున్నారు. ముందస్తు ఆన్లైన్ రిజిస్ట్రేషన్తో పాటు జాబ్ మేళా హెల్ప్డెస్క్ వద్ద కూడా రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించారు. నిరుద్యోగ యువత ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో మార్గాని నాగేశ్వరరావు, మార్తి లక్ష్మి, మార్గాని సురేష్, అరె చిన్ని, కాటం రజనీకాంత్, బిల్డర్ చిన్నా, పీత రామకృష్ణ, వట్టికుటి కృష్ణవేణి, మజ్జి అప్పారావు, దాది గౌరీ శంకర్, మార్తి నాగేశ్వరరావు, నంద కిషోర్, సంతోష్, అనంత లక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస్ అభియాన్‌లో
# బీజేపీ నేతల విస్తృత పర్యటన

**నియోజకవర్గంలోని ప్రతి బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యాచరణ - సంగిశెట్టి రవీంద్ర సాగర్**



కాప్రా (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాచారం హెచ్‌ఎమ్‌టీనగర్ డివిజన్‌లో బీజేపీ నాయకులు విస్తృతంగా పర్యటించారు. డివిజన్ సంయోజకులు (ఇంచార్జి కో–ఆర్డినేటర్), మెద్చల్––మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సభ్యుడు, ఉప్పల్ ఎంబీసీ చైర్మన్ సంగిశెట్టి రవీంద్ర సాగర్, జిల్లా అధికారిక ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ప్రతి బూత్‌ను సందర్శించి పార్టీ కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా బూత్ సంగిశెట్టి రవీంద్ర సాగర్, కార్యకర్తలతో సమావేశమైన నాయకులు పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస్ అభియాన్ పార్టీ సంస్థాగత బలోపేతానికి అత్యంత కీలకమైన కార్యక్రమమని అన్నారు. ప్రతి బూత్‌ను పార్టీకి బలమైన కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ పర్యటనల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచే పార్టీ మరింత పటిష్టంగా ఎదగాలంటే ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలవడం, పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లడం ఈ కార్యక్రమంలో ముఖ్య లక్ష్యాలని ఆయన తెలిపారు. కార్యకర్తలు ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ స్థానిక సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు కీలకమని చెప్పారు. ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పర్యటన సందర్భంగా బూత్ కమిటీల పనితీరు, సభ్యత్వ నమోదు, పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యలపై నాయకులు ఆరా తీశారు. స్థానిక కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. పార్టీ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి బీజేపీని మరింత బలోపేతం చేయాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవిన్ శక్తి కేంద్రాల ఇన్చార్జ్ లు అనిత పద్మ రెడ్డి బొల్లం చంద్రమౌళి, రాజిరెడ్డి, గంధమల్ల గోపి , మంజుల వాణి, కాటెపల్లి రవిందర్ రెడ్డి, ఉదయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నడం జరిగింది.

# ప్రజల గడపకు ప్రభుత్వం

**మందసలో డోర్ టు డోర్ పర్యటించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**

**రెండేళ్ల అభివృద్ధి-సంక్షేమాన్ని ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే**



పలాస(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమం పలాస నియోజకవర్గంలోని మందస మండలంలో ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు తెలుసుకుంటూ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజల వద్దకే వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించడంతో పాటు, వారి నుంచి నేరుగా స్పందన స్వీకరించడం ప్రజాస్వామ్య పాలనకు మంచి ఉదాహరణ అని ఆమె అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి వేగంగా పరిష్కారం చూపేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు శిక్ష..

## రూ.10 వేల జరిమానా, 7 రోజులు కారాగారం..

- మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే..
- రేణిగుంట సీఐ జయచంద్ర.?


**రేణిగుంట** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని రేణిగుంట సీఐ జయచంద్ర హెచ్చరించారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో తిరుపతి స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది.?సీఐ జయచంద్ర తెలిపిన వివరాల ప్రకారం... వడమాలపేటకు చెందిన జి. మస్తాన్ (25, తండ్రి: చిన్నబాబు) మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడటంతో, ఆయనపై మోటారు వాహనాల చట్టం సెక్షన్ 185(ఎ ) ప్రకారం కేసు ( ఎస్ టి సి నెం.: 3191/2026) నమోదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, అతడు తన నేరాన్ని అంగీకరించాడు. దీంతో విచారణ చేపట్టిన గౌరవ మేజిస్ట్రేట్ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ రూ.10,000/- జరిమానా విధించడంతో పాటు, 7 రోజుల సాధారణ కారాగార శిక్ష ఖరారు చేసినట్లు సీఐ జయచంద్ర వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా సీఐ విజ్ఞప్తి చేశారు.

# నువ్వేమైనా మంత్రి కొడుకువా.?

- మహిళా లెక్చరర్ అవమానించడంతో ఇంటర్ టాపర్ ఆత్మహత్య
- జిల్లా టాపర్ కంటే ఒక్క మార్కు తక్కువ
- చెంపపై కొట్టి అవమానించిన లెక్చరర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఆ విద్యార్థి మరింత రెట్టింపు ఉత్సాహంతో చదువుతాడు. ఇది జగమెరిగిన సత్యం. అయితే అదే ఉపాధ్యాయుడు తోటి విద్యార్థుల ముందు అవమానిస్తే ఆ విద్యార్థి తట్టుకోలేడు. కొంతమంది చదువును మధ్యలో ఆపేస్తే మరికొందరు తీసుకోని నిర్ణయం తీసుకుంటారు. అలాంటి ఘటనే ఒకటి తెలంగాణలో జరిగింది. జిల్లా టాపర్ కంటే ఒక్క మార్కు తక్కువ వచ్చిందన్న కారణంతో ఓ మహిళా లెక్చరర్ విద్యార్థిని అవమానించింది. దీంతో విద్యార్థులు అంతా నవ్వారు. అందరిలో ఇలా అవమానించడం కరెక్ట్ కాదని ఆ విద్యార్థి లెక్చరర్‌తో అన్నాడు. దీంతో కోపోద్రిక్తురాలైన ఆ లెక్చరర్ విద్యార్థి చెంపచెల్లుమనిపించిది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ విద్యార్థి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనను అవమానించిన ఆ లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.





### - తరుణ్ చెంపపై కొట్టిన మహిళా లెక్చరర్

జిల్లాలో సెకండ్ టాపర్‌గా నిలిచాడు. టాపర్ కన్నా ఒక్క మార్కు తక్కువ వచ్చింది. దీంతో లెక్చరర్ ఆ విద్యార్థిని అవమానించి, చెంపదెబ్బ కొట్టింది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే గద్వాల రూరల్ కొత్తపల్లి గ్రామానికి చెందిన నేతిబొట్టు తరుణ్ (17) గద్వాల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 440కి 434 మార్కులు సాధించి జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచాడు. అయితే శనివారం కాలేజీలో ఓ మహిళా లెక్చరర్ జిల్లా టాపర్‌కు వచ్చిన 435 మార్కులతో తరుణ్ మార్కులను పోల్చి అతడిని తక్కువ చేసి మాట్లాడారు. అది తరుణ్ తట్టుకోలేకపోయాడు. దీనిపై తరుణ్ ఇలా పోల్చి అవమానించడం తప్పు మేడం అని అన్నాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మహిళా లెక్చరర్ 'నీవేమైనా మంత్రి కొడుకువా? అంతకంటే గొప్పోడివా అంటూ అందరి ముందు తరుణ్ చెంపపై కొట్టారు. లెక్చర్ ప్రవర్తనతో తోటి విద్యార్థులు అంతా నవ్వారు. దీన్ని తరుణ్ తీవ్ర అవమానంగా భావించాడు.

### - ఇంట్లో ఎవరూ లేని సమయంలో తరుణ్ ఆత్మహత్య

మరోవైపు తరుణ్ మహిళా లెక్చరర్ మధ్య చోటు చేసుకున్న అంశం ప్రిన్సిపల్ వీరన్న దృష్టికి వెళ్లింది. దీంతో సోమవారం తరుణ్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మహిళా లెక్చరర్ తనను తీవ్రంగా అవమానించడంతోపాటు కొట్టడం తరుణ్‌ను బాధించింది. లోలోపల తీవ్రంగా కుమిలిపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురైన తరుణ్ మంగళవారం కాలేజీకి వెళ్లలేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. పొలం పనుల నుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు బుచ్చన్న, రేణమ్మ కుమారుడిని విగతజీవిగా చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

# గురుభక్తి వెల్లివిరిసిన పౌర్ణమి

- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలతో భక్తుల సందడి
- వాడవాడలా ఆధ్యాత్మిక శోభ

అమరావతి(ప్రశ్న న్యూస్ ) ఆధ్యాత్మికతకు ప్రతీకగా భావించే గురు పౌర్ణమి పర్వదినాన్ని రాష్ట్రవ్యాప్తంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు సాయిబాబా ఆలయాలు, ఆశ్రమాలు, మఠాలు, దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గురువందన కార్యక్రమాలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించి గురువుల మహిమను కొనియాడారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి బాబా ఆశీస్సులు పొందారు.

### సాయినామ స్మరణతో మారుమోగిన ఆలయాలు

సాయిబాబా ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మహాభిషేకాలు, పుష్పాలంకరణలు, సాయి సత్యవ్రతాలు, భజన కార్యక్రమాలు, హారతులు నిర్వహించారు. భక్తులు "ఓం శ్రీ సాయిరాం" నామస్మరణతో ఆలయ ప్రాంగణాలను ఆధ్యాత్మిక వాతావరణంగా మార్చారు. అనేక చోట్ల రాత్రి వరకు భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.



### వాడవాడలా అన్నదాన మహోత్సవాలు

గురు పౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వందలాది ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీలు, సేవా సంస్థలు, దాతల సహకారంతో వేలాది మంది భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నప్రసాదం అందించారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అన్నదానం చేయడం ద్వారా భారతీయ సంస్కృతిలో గురుపూజకు ఉన్న గొప్పతనాన్ని చాటిచెప్పారు.

### గురువే దైవమనే భావనతో పూజలు

"గురు బ్రహ్మ... గురు విష్ణు... గురు దేవో మహేశ్వరః" అనే వేదవాక్యాన్ని స్మరిస్తూ గురువులను దైవస్వరూపంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక ఆశ్రమాల్లో ఆధ్యాత్మిక గురువులకు పాదపూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు.

### ఆధ్యాత్మిక చింతనకు ప్రాధాన్యం

గురు పౌర్ణమి సందర్భంగా అనేక చోట్ల ధార్మిక సభలు, ప్రవచనాలు నిర్వహించి గురువు జీవితంలో ఎంత ముఖ్యమో వివరించారు. సత్యం, ధర్మం, సేవ, మానవత్వం వంటి విలువలను ఆచరించాలని ఆధ్యాత్మిక వేత్తలు పిలుపునిచ్చారు. యువతలో భారతీయ సంస్కృతి, గురు–శిష్య సంప్రదాయంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

### భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. మహిళలు, యువత, వృద్ధులు, చిన్నారులు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, స్వచ్ఛంద సేవకులు సేవలు అందించారు రాష్ట్రవ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలు భక్తి, సేవ, ఆధ్యాత్మిక చింతనల సమ్మేళనంగా ఘనంగా జరిగాయి. ఆలయాల్లో మారుమోగిన సాయినామ స్మరణ, వేలాది మందికి నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలు, గురువుల పట్ల వ్యక్తమైన భక్తి ఈ పర్వదినానికి మరింత వైభవాన్ని తీసుకొచ్చాయి. గురువు చూపే మార్గమే జీవితానికి వెలుగుదారి అనే సందేశంతో ఈ ఏడాది గురు పౌర్ణమి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి

# ఆగస్టు 1 నుంచి చౌక బియ్యం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు
- నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- జాయింట్ కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలు.
- ఆధార్ నమోదు తప్పనిసరి
- జిల్లాల మధ్య బియ్యం సర్దుబాటుకు కార్యాచరణ



**అమరావతి(ప్రశ్న న్యూస్ )** సామాన్య ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ప్రారంభించనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విస్తృత ప్రచారం నిర్వహించాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులు, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి సన్నద్ధతలను సమీక్షించారు.

### ప్రజలకు భరోసా... చౌక ధరలో నాణ్యమైన బియ్యం

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగించే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ చేరేలా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. ప్రజలు నమ్మకంతో కొనుగోలు చేసేలా బియ్యం నాణ్యత అత్యున్నత స్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు.

### నాణ్యతపై రాజీకి తావులేదు

ప్రజలకు అందించే బియ్యంలో ఎలాంటి నాణ్యత లోపం ఉండకూడదని రైస్ మిల్లర్లకు మంత్రి హెచ్చరించారు. బీపీటీ స్టీమ్, రా రైస్‌ను మాత్రమే సరఫరా చేయాలని, నాసిరకం బియ్యం పంపిణీ జరిగితే సహించబోమని స్పష్టం చేశారు.

### రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా భావించి సరఫరా

ఎక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంటే అక్కడికి ఇతర జిల్లాల నుంచి బియ్యం తరలించే విధంగా రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి కార్యాచరణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ఇతర జిల్లాల నుంచి నిల్వలను తరలించాలని సూచించారు.

### ప్రత్యేక యాప్‌తో నిరంతర పర్యవేక్షణ

బియ్యం అమ్మకాలు, వినియోగదారుల కొనుగోళ్లు, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ యాప్‌ను వినియోగించనున్నట్లు తెలిపారు. ఏ జిల్లాలో డిమాండ్ పెరిగినా వెంటనే స్పందించేలా జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

### ఆధార్ నమోదు తప్పనిసరి

బియ్యం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి కొనుగోలుదారుడి ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. దీంతో బియ్యం పక్కదారి పట్టకుండా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

### సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా

నెల్లూరు వంటి సరిహద్దు జిల్లాల నుంచి ధాన్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. దీంతో రాష్ట్రంలోని రైస్ మిల్లర్లకు ధాన్యం అందుబాటులో ఉండటంతో పాటు ధరలు కూడా స్థిరపడతాయని తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, డైరెక్టర్ నఫూర్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పులుల సంరక్షణలో ఏపీని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**- తూర్పు కనుమల్లో పునరుజ్జీవానికి చర్యలు..**

**- అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందేశం**




అమరావతి(ప్రశ్న న్యూస్) పులుల సంరక్షణ అంటే కేవలం ఒక జాతిని కాపాడడం మాత్రమే కాదని, అడవులు, జీవ వైవిధ్యం, జల వనరులు, భావితరాల సహజ వారసత్వాన్ని పరిరక్షించడమేనని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన సందేశంలో ఆయన పులుల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రపంచంలోని పులుల్లో దాదాపు 75 శాతం భారతదేశంలోనే ఉండటం దేశం సాధించిన గొప్ప పర్యావరణ విజయమని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్) దేశంలోనే అతిపెద్ద పులుల సంరక్షణ ప్రాంతంగా నిలవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో విస్తరించి ఉన్న ఈ రిజర్వ్ పులులతో పాటు అనేక వన్యప్రాణులకు సురక్షిత ఆవాసంగా మారిందని తెలిపారు. తాజా అంచనాల ప్రకారం ఎన్ఎస్‌టీఆర్–శేషాచలం పరిధిలో 68 పులులు, 11 పులి పిల్లలు నమోదుకావడం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంరక్షణ చర్యలకు నిదర్శనమని పవన్ కళ్యాణ్ చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేట నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం, గడ్డి మైదానాల అభివృద్ధి, వేట జంతువుల సంఖ్య పెంపు, డ్రోన్లు, కెమెరా ట్రాప్‌లు, ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థల వినియోగంతో అటవీ ప్రాంతాల భద్రతను మరింత పటిష్ఠం చేసినట్లు వివరించారు.

### తూర్పు కనుమల్లో పులుల పునరుజ్జీవం

తూర్పు కనుమల ప్రాంతంలో పులుల జన్యు వైవిధ్యం, జనాభా పెంపు కోసం మహారాష్ట్రలోని చంద్రపూర్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆడ పులులను తీసుకురావడానికి సూత్రప్రాయ అంగీకారం లభించిందని తెలిపారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న అటవీ శాఖ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

# ఏనుగుల సమస్యకు 'గుచ్చిమి' పరిష్కారం

**మానవ--ఏనుగు సంఘర్షణల నివారణకు**

**కుంకీ ఏనుగుల శిబిరం**

**రైతుల పంటలు, ప్రజల ప్రాణాలకు రక్షణే లక్ష్యం**

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



అమరావతి/పార్వతీపురం మన్యం(ప్రశ్న న్యూస్) ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవ--ఏనుగు సంఘర్షణలకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసిందని ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గుచ్చిమిలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని బుధవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ప్రకృతి మనిషికి చెందినది కాదని, మనిషే ప్రకృతిలో భాగమని పేర్కొన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు. అడవి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించి పంటలు ధ్వంసం చేయడం, ప్రజల్లో భయాందోళనలు నెలకొనడం వంటి సమస్యలకు శాస్త్రీయ పరిష్కారం అందించేందుకే గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె. అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రికి కేంద్రం అండ

**ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా కనకదుర్గ ఆలయ అభివృద్ధికి: లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ గళం**

**ప్రసాద్ పథకం కింద ప్రత్యేక నిధులు**

**- పర్వతమాల కింద రోప్‌వే**

**భక్తుల సౌకర్యాలే లక్ష్యమని స్పష్టీకరణ**




న్యూఢిల్లీ/విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజయవాడ లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్ వేదికగా విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో నియమం--377 కింద ప్రత్యేక అంశాన్ని ప్రస్తావించిన ఆయన, ఆలయ సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, యాత్రికుల సౌకర్యాల కోసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.

**ఆధ్యాత్మిక వైభవానికి చిరునామా**

కృష్ణానది ఒడ్డున ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగిన శక్తిపీఠమని ఎంపీ పేర్కొన్నారు. తిరుమల తర్వాత అత్యధిక భక్తుల రాకపోకలు ఉండే ప్రధాన పుణ్యక్షేత్రాల్లో ఇది ఒకటని తెలిపారు. ముఖ్యంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, భవానీ దీక్షలు, తెప్పోత్సవం వంటి వేడుకల సమయంలో దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని వివరించారు.

**పెరుగుతున్న భక్తుల రద్దీ పెరగాల్సిన వసతులు**

ప్రతిరోజూ సుమారు 50 వేల మంది, పండుగల సమయంలో రెండు లక్షలకు పైగా భక్తులు ఆలయానికి వస్తున్న నేపథ్యంలో అదే స్థాయిలో శాశ్వత మౌలిక వసతులు కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను విస్తరించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలు అమలైతే ఇంద్రకీలాద్రి కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాదు, దేశ ఆధ్యాత్మిక పర్యాటక రంగానికే ఒక కొత్త ప్రమాణంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కలెక్టర్ కార్యాలయం వెనుక... 'మృత్యు భవనాలు

**కూలిపోతామంటున్న ప్రభుత్వ కార్యాలయాలు**

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు**

**చినుకే చాలు... కార్యాలయాల్లోకి వరదలా నీరు**

**- గోడల నుంచి కరెంట్ షాక్‌లు, రికార్డులకు ముప్పు**

**- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో సిబ్బంది**

గుంటూరు(ప్రశ్న న్యూస్)జిల్లా ప్రజల సమస్యలకు పరిష్కార కేంద్రంగా నిలవాల్సిన గుంటూరు కలెక్టర్ కార్యాలయ ఆవరణలోనే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. కలెక్టర్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయం, జిల్లా సహకార అధికారి కార్యాలయం భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతాయోనన్న భయాన్ని కలిగిస్తున్నాయి. ప్రతిరోజూ



వందలాది మంది ఉద్యోగులు, రైతులు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ కార్యాలయాలు ఇప్పుడు ప్రమాదకర స్థితిలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

భవనం మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. గోడలపై సిమెంట్ పెచ్చులు ఊడిపోవడం, కాంక్రీట్ పూర్తిగా దెబ్బతిని లోపల ఉన్న ఇనుప రాడ్లు బయటకు కనిపించడం, పిల్లర్లు బలహీనపడటం, కిటికీలు విరిగిపోవడం, పైకప్పు నుంచి పెచ్చులు రాలిపడటం వంటి దృశ్యాలు అక్కడ సాధారణంగా కనిపిస్తున్నాయి. ఒక్కోసారి చిన్న శబ్దం వచ్చినా ఉద్యోగులు ఉలిక్కిపడే పరిస్థితి నెలకొంది.

### వర్షం పడితే కార్యాలయం కాదు... చెరువే

కొద్దిపాటి వర్షం కురిసినా కార్యాలయ గదుల్లోకి నీరు ప్రవేశిస్తోంది. పైకప్పు నుంచి నీరు కారుతూ ఫైళ్లు, రికార్డులు పూర్తిగా తడిసిపోతున్నాయి. అత్యంత విలువైన ప్రభుత్వ పత్రాలను కాపాడుకునేందుకు ఉద్యోగులు ప్లాస్టిక్ షీట్లు కప్పడం, బల్లలపైకి ఎత్తిపెట్టడం వంటి చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం కనిపించడం లేదు. కొన్నిచోట్ల రికార్డులను గది బయట ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. వర్షం వస్తే అవి కూడా తడిసి నాశనం అవుతున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గోడల నుంచి నీరు... కరెంట్ షాక్‌ల భయం

భవనం గోడలు పూర్తిగా తడిసి నీరు ఊరుతుండటంతో విద్యుత్ వైరింగ్ కూడా ప్రమాదకరంగా మారింది. వర్షం సమయంలో కొన్ని చోట్ల కరెంట్ షాక్‌లు తగులుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది భయభయంగా విద్యుత్ స్విచ్‌లు ఆన్ చేయాల్సి వస్తోంది. ఒకవేళ భారీ వర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని అందరూ ఆందోళన చెందుతున్నారు.

### మెట్లు ఎక్కాలంటేనే భయం

భవనం అంతస్తులకు వెళ్లే మెట్లు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి.



సిమెంట్ ఊడిపోవడం, ఇనుప రాడ్లు బయటపడటం వల్ల ఎప్పుడు విరిగిపోతాయోనన్న పరిస్థితి ఉంది. ప్రతి రోజు ఆ మెట్లపైనే ఉద్యోగులు, ప్రజలు నడవాల్సి వస్తుండటంతో ప్రమాదం పొంచి ఉందని సిబ్బంది చెబుతున్నారు.

### మహిళా ఉద్యోగులకు కనీస వసతులే లేవు

కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులకు కనీస సౌకర్యాలు



కూడా అందుబాటులో లేవని తెలుస్తోంది. మరుగుదొడ్లలో నీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. శుభ్రత లేకపోవడం, నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడం వల్ల కార్యాలయ వాతావరణం అసౌకర్యంగా మారిందని అంటున్నారు.

### రికార్డులు రక్షణ లేక రోడ్డునే...

ప్రభుత్వానికి సంబంధించిన కీలక రికార్డులు భద్రపరచడానికి సరైన గదులు లేకపోవడంతో కొన్నింటిని బయట ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే అవి తడిసి పాడైపోతున్నాయి. ఎన్నో ఏళ్లుగా భద్రపరిచిన ప్రభుత్వ పత్రాలు నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు... మరమ్మతుల హామీ

ఈ పరిస్థితులపై ప్రజా ప్రశ్న ప్రతినిధులు ఉద్యోగులను వివరణ కోరగా, సమస్యను ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని వారు తెలిపారు. త్వరలోనే మరమ్మతులు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. అయితే హామీ వచ్చినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో ఉద్యోగుల్లో నిరాశ నెలకొంది.

### భయం మధ్యే విధులు




రోజూ ఉదయం కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు సాయంత్రం సురక్షితంగా ఇంటికి చేరుకుంటామో లేదోనన్న భయంతో విధులు నిర్వర్తిస్తున్నామని చెబుతున్నారు. పైకప్పు ఎప్పుడు కూలిపోతుందో, గోడలు ఎప్పుడు విరిగిపడతాయో, విద్యుత్ ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందో తెలియని పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ కార్యాలయం పరిసరాల్లోనూ ఇదే దుస్థితి



కేవలం ఈ రెండు కార్యాలయాలే కాదు... కలెక్టర్ కార్యాలయం చుట్టుపక్కల ఉన్న మరికొన్ని ప్రభుత్వ భవనాలు కూడా శిథిలావస్థలో ఉన్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. కొద్దిపాటి వర్షానికే కార్యాలయ ఆవరణలో నీరు నిలిచిపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, భవనాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఏళ్లుగా కొనసాగుతున్నాయని పేర్కొంటున్నారు.

### ప్రమాదం జరిగాక స్పందిస్తారా.?

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సేవలందించే ఉద్యోగుల భద్రతను విస్మరించడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. భవనం కూలిపోయిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఉద్యోగులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది.

### తక్షణ చర్యలు అవసరం

జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ భవనాలను పరిశీలించి, నిపుణుల కమిటీతో నిర్మాణ భద్రత పరీక్షలు నిర్వహించి, ప్రమాదకరంగా ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ భవనాలకు కార్యాలయాలను తరలించాలని ఉద్యోగులు కోరుతున్నారు. అవసరమైతే కొత్త భవనాల నిర్మాణానికి వెంటనే చర్యలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే ప్రభుత్వ కార్యాలయాలే ఇప్పుడు తమ సిబ్బంది ప్రాణాలకు ముప్పుగా మారడం అత్యంత విచారకరం. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ప్రమాదం జరిగేలోపు శాశ్వత పరిష్కారం చూపితేనే ఉద్యోగుల ప్రాణాలు, ప్రభుత్వ రికార్డులు, ప్రజా సేవలు సురక్షితంగా ఉంటాయి.

# గరుడునిపై గోవిందుని దివ్య విహారం

**తిరుమలలో పౌర్ణమి గరుడసేవ మహావైభవం**

**గరుడ దర్శనంతో సర్వపాప ప్రాయశ్చిత్తం..**

**జ్ఞాన--వైరాగ్యాలకు ప్రతీకగా నిలిచిన వాహనసేవ**



తిరుమల(ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పౌర్ణమి గరుడసేవ బుధవారం రాత్రి తిరుమలలో అత్యంత వైభవంగా జరిగింది. సర్వాభరణ భూషితుడై శ్రీ మలయప్ప స్వామివారు గరుడ వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. "గోవింద... గోవింద..." నామస్మరణలతో మారుమోగిన తిరుమలలో వేలాది మంది భక్తులు గరుడసేవను తిలకించి పులకించిపోయారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ వాహనసేవలో శ్రీవారు స్వర్ణాభరణాలు, పుష్పాలంకరణలతో అపూర్వంగా అలంకరించబడి గరుడునిపై కొలువుదీరారు. వేదఘోషలు, మంగళవాయిద్యాలు, భజన బృందాల కీర్తనల మధ్య శ్రీవారి ఊరేగింపు అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. ఆలయ మాడ వీధులు విద్యుద్దీపాల కాంతులతో, భక్తుల జయజయధ్వానాలతో ఆధ్యాత్మిక క్షేత్రంగా మారాయి. వైష్ణవ సంప్రదాయంలో గరుడసేవకు అత్యున్నత స్థానం ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న 108 వైష్ణవ దివ్యదేశాలలో గరుడ వాహనసేవను అత్యంత పవిత్రమైన ఉత్సవంగా భావిస్తారు. శ్రీమహావిష్ణువు వాహనమైన గరుడుడు భక్తి, జ్ఞానం, వైరాగ్యాలకు ప్రతీకగా ఆరాధించబడతాడు. గరుడుని రెక్కలు జ్ఞానం, వైరాగ్యాలకు సంకేతాలుగా పరిగణించబడతాయి. అలాంటి గరుడునిపై శ్రీవారిని దర్శించుకోవడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని, సర్వపాపాలు పరిహారమై దైవానుగ్రహం సిద్ధిస్తుందని పురాణాలు పేర్కొంటాయి. గరుడవాహన సేవ మరో విశిష్ట సందేశాన్ని కూడా అందిస్తుంది. భక్తుల పట్ల భగవంతుని అపారమైన ప్రేమ, దాసానుదాస భావం, శరణాగతి మహిమను ఈ సేవ ప్రతిబింబిస్తుంది. భగవంతుని ఆశ్రయించిన వారికి ఆయన ఎల్లప్పుడూ రక్షకుడిగా ఉంటాడనే విశ్వాసాన్ని గరుడసేవ బలపరుస్తుంది. అందుకే గరుడ దర్శనాన్ని జీవితంలో ఒక మహాభాగ్యంగా వైష్ణవులు భావిస్తారు. పౌర్ణమి రాత్రి చంద్రకాంతిలో గరుడునిపై విహరించిన శ్రీ మలయప్ప స్వామివారి దివ్యమంగళ స్వరూపం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శ్రీవారి కటాక్షం లభిస్తే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు సిద్ధిస్తాయని విశ్వసిస్తూ భక్తులు గరుడసేవలో పాల్గొన్నారు. గరుడునిపై దర్శనమిచ్చే శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఒక్కసారి భక్తిశ్రద్ధలతో దర్శించినా సకల పాపాలు పరిహారమై, ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుందనే విశ్వాసంతో ప్రతి నెలా వేలాది మంది భక్తులు ఈ మహోత్సవానికి తరలివస్తుంటారు.

# శ్రీశైలంలో గురుపౌర్ణమి వైభవం

**దక్షిణామూర్తి, వేదవ్యాస మహర్షికి విశేషపూజలు**

**వేదవ్యాస మహర్షి సేవలను స్మరించుకున్న భక్తులు.**

**. ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో బుధవారం ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి--హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్ద దక్షిణామూర్తి స్వామివారికి, వేదవ్యాస మహర్షికి వేదోక్తంగా విశేషపూజలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని గురుపరంపర వైభవాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమానికి ముందుగా పూజా సంకల్పం పఠించి, మహాగణపతి పూజ నిర్వహించారు.

అనంతరం దక్షిణామూర్తి స్వామివారు, వేదవ్యాస మహర్షి చిత్రపటాలకు షోడశోపచార పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వేదఘోష, మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ పూజలు భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా వేదవ్యాస మహర్షి మహోన్నత సేవలను స్మరించుకున్నారు. ఒకే రాశిగా ఉన్న వేదాలను ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదంగా నాలుగు భాగాలుగా విభజించి ప్రపంచానికి అందించిన మహర్షి కృష్ణద్వైపాయనుడే వేదవ్యాసుడిగా ప్రసిద్ధి చెందారని పండితులు వివరించారు. వేదాల సారాంశాన్ని సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా మహాభారతాన్ని రచించి, దానికి పంచమవేద స్థానం కల్పించిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. గురుపౌర్ణమి సందర్భంగా దక్షిణామూర్తి స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు గురుతత్వ మహిమను చాటిచెప్పాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎ.వి. రమణ, బోనేని రమణమ్మ, చిట్టిబొట్ల భరద్వాజశర్మ, జి. లక్ష్మేశ్వరి, కోడె కాంతివర్ధిని, మేడా మురళీధర్, ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, పి.యూ. శివమ్మ, జిల్లెల శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితులు ఆకుల శ్రీనివాసులు, ప్రధానార్చకులు, అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా పద్మశ్రీ గ్రహీత సోమ్‌లాల్ నాయక్‌కు ఘన సత్కారం



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఎండోమెంట్ (ధార్మిక) సెల్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త కేతావత్ సోమ్‌లాల్ నాయక్ ని ఎండోమెంట్ జిల్లా కన్వీనర్ బలిజపల్లి చంద్రమౌళి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు జిల్లెల రవీందర్ రెడ్డి, చింతకింది ప్రవీణ్, పడిత్యా నాయక్ తదితరులు పాల్గొని సోమ్‌లాల్ నాయక్ ని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, భువనగిరి మండలం ఆకుతోటబావికి చెందిన ప్రముఖ సాహితీవేత్త కేతావత్ సోమ్‌లాల్ నాయక్ బంజారా భాషా, సాహిత్య అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించి ఆ భాషా సంస్కృతిని విశ్వవ్యాప్తంగా పరిచయం చేసినందుకు ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మశ్రీ అవార్డు లభించిందని పేర్కొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించిన సోమ్‌లాల్ నాయక్ సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. గురుపౌర్ణమి సందర్భంగా ఇలాంటి మహనీయులను సత్కరించడం ద్వారా సమాజంలో విద్య, సంస్కృతి, సాహిత్య విలువలను మరింతగా చాటిచెప్పే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ములుగులో భారీ వర్షాలు: పోలీసులు హైఅలర్ట్

**వరద ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం.**

**అత్యవసరం తప్ప బయటకు రావద్దు.**




ములుగు(ప్రశ్నన్యూస్)జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు ప్రమాదకరంగా మారడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎస్ డిపిఓ ఎన్. రవీందర్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలు, ప్రధాన రహదారులపై 24 గంటల పెట్రోలింగ్ చేస్తున్నాం. ఉప్పొంగుతున్న నీటిని ఎవరూ దాటొద్దు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు అన్నారు. మేడారం ఎస్ హెచ్ ఓ కమలాకర్ మాట్లాడుతూ మేడారం చుట్టుపక్కల వాగులు ప్రమాద స్థాయిలో ఉన్నాయి. భక్తులు, గ్రామస్థులు నీటి వద్దకు వెళ్లొద్దు. పిల్లలను ప్రత్యేకంగా జాగ్రత్తగా చూసుకోవాలి" అని కోరారు. పస్రా సి ఐ మధుకర్ మాట్లాడుతూ రైతులు, పశువుల కాపరులు వర్షం, పిడుగుల సమయంలో చెట్ల కింద ఉండొద్దు. వాహనదారులు రాత్రి ప్రయాణాలు తగ్గించి రోడ్డు పరిస్థితి తెలుసుకుని బయలుదేరాలి అని సూచించారు. ప్రజలు ప్రభుత్వ సూచనలు పాటించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు,అధికారుల సమన్వయమే విజయానికి మార్గం

- ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవ రెడ్డి
- గ్రామాభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యంత కీలకమని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన నిధులు వెచ్చించాలని కోరారు. పంచాయతీల పాలక మండళ్ల ఏర్పడి ఏడు నెలలు పూర్తైన నేపథ్యంలో అధికారులతో సమావేశాలు నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమని అన్నారు. గ్రామాల్లో ప్రజలతో నిత్యం మమేకమయ్యే సర్పంచులకు సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందని, అధికారులు వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని వేగంగా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా, తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ సువర్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, తహసీల్దార్ స్వామి, ఎంపీడీవో మహేష్, ఎంపీఓ దయాకర్, సూపరింటెండెంట్ రాజశేఖర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మరమ్మత్తులు కాదు.. శాశ్వత రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి

**- సిపిఎం మండల కార్యదర్శి నరేష్ డిమాండ్**





మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ పరిధిలో రోడ్లపై పడ్డ గుంతలకు మరమ్మత్తులు చేయడం కాదు శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి నరేష్ డిమాండ్ చేశారు. కేఎల్ఆర్ వెంచర్ లో రోడ్డుపై పడ్డ గుంతలను మట్టితో పూడ్చడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని నరేష్ తెలిపారు. మట్టితో పూడ్చి చేతులు దులుపుకుంటే కుదరదని శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన చేశారు. గుంతలలో మట్టి నింపి వెళ్ళాక ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల మళ్లీ గుంతలు యధాస్థితికి వస్తాయని గుంతలలో మట్టి నింపిన లాభం లేదని ఆయన పేర్కొన్నారు. రోడ్లపై పడ్డ గుంతల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు అంతా ఇంత కావని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల గుంతలలో నీరు చేరి ఏది రోడ్డు ఏది గుంతనో అర్థం కాక ప్రమాదాల బారిన పడుతున్నారని నరేష్ ఆరోపించారు. ముఖ్యంగా రాత్రి వేళలో పరిస్థితి దయనీయంగా ఉందని, మేడ్చల్ పరిసర ప్రాంతాలలో పరిస్థితి ఇదే విధంగా ఉందని ఏదో తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని శాశ్వత రోడ్డు నిర్మాణాలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని నరేష్ డిమాండ్ చేశారు.

## పులుల సంరక్షణ పట్ల అన్ని వర్గాల వారు వ బాధ్యతాయుతంగా ఉండాలి

**మంత్రి కొండా సురేఖ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. అదే విధంగా అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి సురేఖ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలకు ఆగస్టు 7 వరకు అవకాశం

- బి.ఏ., బి.కాం., బి.ఎస్సి. మొదటి, రెండో, మూడో సంవత్సరాల్లో ప్రవేశాలు
- అపరాధ రుసుము లేకుండానే అడ్మిషన్లు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్ అధ్యయన కేంద్రంలో ధ్రువీకరణ తప్పనిసరి




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2026--27 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ (బి.ఏ., బి.కాం., బి.ఎస్సి.) ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో ప్రవేశాలకు ఆగస్టు 7, 2026 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్‌లోని అధ్యయన కేంద్ర సమన్వయకర్త డా. ఎం. భవాని తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందే అభ్యర్థులు ఇంటర్మీడియట్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, పాలిటెక్నిక్, ఐటీఐ (10o2) లేదా తత్సమాన అర్హత కలిగిన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు www.braouonline.in వెబ్‌సైట్‌లో లేదా టి ఎస్ ఆన్లైన్ , మీ సేవ, ఇంటర్నెట్ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, అనంతరం సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలు మరియు జిరాక్స్ ప్రతులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్‌లోని అధ్యయన కేంద్రంలో ధ్రువీకరణ పూర్తి చేసుకోవాలని సూచించారు.

ధ్రువీకరణ అనంతరం నిర్ణీత ఫీజు చెల్లించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే ప్రవేశం పొందవచ్చని వెల్లడించారు. అడ్మిషన్లకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రాన్ని లేదా 7382929738 నంబర్‌ను సంప్రదించాలని అధ్యయన కేంద్ర సమన్వయకర్త డా. ఎం. భవాని సూచించారు.

## లంబాడీ తండాలో డ్రైనేజీ దుస్థితి

- దుర్వాసనతో ప్రజల అవస్థలు
- కాలువలు నిండిపోయి మురుగు
- పట్టించుకోని పంచాయతీపై గ్రామస్తుల ఆగ్రహం.

**కోయగూడ తండాలో అంటువ్యాధుల భయం**

- శాశ్వత పరిష్కారం కోరిన వాసులు




ములుగు (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కోయగూడ,ఎల్లాపూర్ గ్రామంలోని లంబాడీ తండాలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం కావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు మురుగునీటితో నిండిపోయి వారాల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇంటి ముందు నుంచి వెళ్లడం కూడా కష్టంగా మారిందని వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సర్పంచ్, పంచాయతీ సిబ్బంది సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షాకాలం కావడంతో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఈగలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కాలువలను వెంటనే శుభ్రపరిచి, మురుగు నిల్వ లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్తుడు అజ్మీర్ రాజకుమార్ డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని తండా ప్రజలు కోరుతున్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా గురు స్వాములకు ఘన సన్మానం

**అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధల మధ్య వేడుకలు**

**శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నంగునూరి సత్యనారాయణ**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గురు పౌర్ణమి సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం గురు స్వాములకు ఘన సన్మానం నిర్వహించారు. ఆర్యవైశ్య సీనియర్ నాయకులు, అభయ హస్తం గౌరవ అధ్యక్షులు నంగునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గురు స్వాములను శాలువాలతో సత్కరించి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తూ, ధర్మ పరిరక్షణతో పాటు సమాజ సేవలోనూ విశిష్ట సేవలు అందిస్తున్న గురు స్వాముల సేవలు ప్రశంసనీయమని అన్నారు. గురు పౌర్ణమి పర్వదినాన వారిని సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువు చూపిన మార్గంలో నడుస్తూ సనాతన ధర్మ విలువలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. గురువుల ఆశీస్సులతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల నడుమ గురు పూజలు నిర్వహించి అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

# ‘ముసాఫిర్ కేఫ్’ సిరీస్ రివ్యూ!




బలమైన కథలను .. వైవిధ్యభరితమైన పాత్రలను ఎంచుకుంటూ విక్రాంత్ మస్సే తన కెరియర్ లో ముందుకు వెళుతున్నాడు. ఆయన నుంచి ఒక సిరీస్ గానీ .. సినిమాగాని వస్తుందంటే, ఆ కంటెంట్ లో ఏదో విశేషం ఉండే ఉంటుందనే ఒక నమ్మకం ఆడియన్స్ కి ఏర్పడిపోయింది. అలాంటి ఆయన కథానాయకుడిగా రూపొందిన తాజా సిరీస్ ‘ముసాఫిర్ కేఫ్’. రుచిర్ అరుణ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్, 8 ఎపిసోడ్స్ గా నిర్మితమైంది. ‘నెట్ ఫ్లిక్స్’లో హిందీతో పాటు ఇతర భాషల్లో ఈ నెల 24వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. చంద్రమోహన్ శర్మ ( విక్రాంత్ మస్సే) ను అందరూ ‘చందర్’ అని పిలుస్తూ ఉంటారు. అతను మధ్యప్రదేశ్ లో ఒక సంస్థలో పనిచేస్తూ ఉంటాడు. అతని తల్లిదండ్రులు ‘ఢిల్లీ’లో ఉంటూ ఉంటారు.ఆ సమయంలో అతను పెళ్లి విషయంగా ‘సుధ’ (వేదిక పింటో)ను కలుస్తాడు. ఆమె ఓ లాయర్. ఆమె ఆలోచనలు .. అభిప్రాయాలు అర్థమైన తరువాత, తనకీ .. ఆమెకి సెట్ కాదని ఇంట్లో వాళ్లకి చెబుతాడు. అయితే అతను ‘భోపాల్’కి వచ్చిన తరువాత మళ్లీ ఆమె తారసపడుతుంది. ఆ తరువాత వాళ్ల పరిచయం ప్రేమగా మారుతుంది. ‘సుధ’ తన చిన్నప్పుడే తండ్రిని కోల్పోతుంది. అప్పటి నుంచి ఎన్నో కష్టాలు పడుతూ తల్లి ఆమెను పెంచుతుంది. అందువలన తాను ‘ముంబై’లో లాయర్ గా స్థిరపడాలనీ, డబ్బు బాగా సంపాదించాలనేది ఆమె ఆశయం. తన తల్లిని సంతోషంగా చూసుకోవాలనేది ఆమె కోరిక. అది నెరవేరేవరకూ పెళ్లి చేసుకోకూడదనేది ఆమె నిర్ణయం. అదే విషయాన్ని ఆమె చందర్ తో చెబుతుంది. సుధ తన మకామ్ ను చందర్ ఫ్లాట్ కి మార్చడంతో, ఇద్దరూ సహజీవనం చేయడం మొదలుపెడతారు. మొదటి నుంచి కూడా చందర్ కి ప్రకృతి అంటే ఇష్టం. ఆ తరువాత అతను ఎక్కువగా ఇష్టపడేది కాఫీ. తనదైన పద్ధతిలో కాఫీ తయారు చేయడంలో ఆయనకి మంచి నైపుణ్యం ఉంటుంది. కొండల ప్రాంతంలో ఒక కేఫ్ పెట్టాలనీ .. అక్కడ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనేది అతని కల. అలాంటి ఆ జంట మధ్యలోకి ‘ప్రీతి’ వస్తుంది. ప్రీతి ఎవరు? ముంబైలో స్థిరపడాలనే సుధ కోరిక నెరవేరుతుందా? కొండ ప్రాంతంలో కేఫ్ పెట్టాలనే చందర్ కల నిజమవుతుందా? వాళ్లిద్దరి పెళ్లి జరుగుతుందా? అనేది మిగతా కథ.జీవితమన్నాక ఆశయమంటూ ఒకటి ఉండాలి.

ఎలాంటి అవాంతరాలు .. అడ్డంకులు ఎదురైనా ఆశయసాధన దిశగా సాగిపోవాలని కొంతమంది భావిస్తారు. తాము అనుకున్నది సాధించడానికి ప్రేమ - పెళ్లి అనేవి అడ్డుగా మారతాయని ఆలోచన చేస్తారు. అవతలివారి ఎమోషన్స్ తో పని లేకుండా, తమకి తోచిన నిర్ణయాన్ని తీసుకుంటూ ముందుకు వెళ్లిపోతుంటారు. అలా ప్రేమకి .. పెళ్లికి దూరంగా వెళ్లిన ఒక యువతి, చివరికి ఎలాంటి అభిప్రాయానికి వచ్చిందనే కథ ఇది.సుధ - చందర్ కి సంబంధించిన గతం, ప్రీతి - చందర్ కి సంబంధించిన వర్తమానాన్ని సమాంతరంగా చూపిస్తూ వెళుతూ దర్శకుడు ఈ కథపై ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తించాడు. సుధ- చందర్ మధ్య లవ్ - రొమాన్స్ సన్నివేశాలను చూస్తున్న ప్రేక్షకులు, వాళ్లిద్దరూ ఎందుకు విడిపోయి ఉంటారు? అనే కుతూహలంతో వెయిట్ చేస్తూ ఉంటారు. అదే సమయంలో ప్రీతి ఎలా అతని జీవితంలోకి ప్రవేశించి ఉంటుందనేది తెలుసుకోవాలనే ఆసక్తితో కథను ఫాలో అవుతూ ఉంటారు. ‘కల’ను నిజం చేసుకోవడంలోనే జీవితానికో అర్థం ఉంటుంది అనేది సుధ కాన్సెప్ట్. ‘నా కల - నిజం రెండూ నువ్వే’ అనేది చందర్ మాట. ఈ రెండు మనసుల మధ్య జరిగే సంఘర్షణ చుట్టూ ఈ కథ నడుస్తూ ఉంటుంది. లవ్ .. రొమాన్స్ పాళ్లు కలిసినప్పటికీ, మొదటి మూడు ఎపిసోడ్స్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. నాలుగో ఎపిసోడ్ నుంచి మాత్రం కథ పుంజుకుంటుంది. ఫీల్ తో కూడిన ఎమోషన్స్ మనసును పట్టుకుంటూ ఉంటాయి. ప్రధానంగా ఈ కథ సుధ.. చందర్ .. ప్రీతి అనే మూడు పాత్రలతో సాగుతుంది.

ఇక సందర్భాన్ని బట్టి మిగతా పాత్రలు వచ్చి వెళుతూ ఉంటాయి. ఈ మూడు పాత్రలను మలచిన తీరులోనే దర్శకుడు ఎక్కువ మార్కులు కొట్టేశాడు. లవ్ .. రొమాన్స్ .. సున్నితమైన భావోద్వేగాలను ఆవిష్కరించడంలో తన పనితనం చూపించాడు. ముఖ్యంగా ఈ కథకు అవసరమైన ఫీల్ ను వర్కౌట్ చేయడంలో సక్సెస్ అయ్యాడని చెప్పాలి. విక్రాంత్ మస్సే మంచి నటుడే అయినప్పటికీ, ఈ సిరీస్ దగ్గరికి వచ్చేసరికి వేదిక పింటో నటన హైలైట్ గా నిలుస్తుంది. అక్కడక్కడా ‘త్రిష’ను గుర్తుచేస్తూ .. ఆ పాత్రలో ఆమె పూర్తిగా ఒదిగిపోయింది. తన చలాకీ తనంతో ఆట్టుకుంటుంది. రుచిర్ అరుణ్ కథ - స్క్రీన్ ప్లే .. అనిరుద్ధ చిత్రీకరణ ఆకట్టుకుంటుంది. నీల్ అధికారి నేపథ్య సంగీతం బాగుంది. యశ జైదేవ్ ఎడిటింగ్ మెప్పిస్తుంది. బలమైన .. బరువైన కథాకథనాలతో కూడిన ఈ సిరీస్ మనసుకు హత్తుకుంటుంది. వేదిక పింటో నటన ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని చెప్పచ్చు.

# జీ5 సంచలనం..

## ఎన్బీకే111, వెంకీ5 సహా భారీ చిత్రాలతో మెగా లైనప్!




ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 సంచలన ప్రకటన చేసింది. తెలుగు, హిందీ, తమిళం సహా మొత్తం 7 భాషల్లో సినిమాలు, వెబ్ సిరీస్‌లతో కూడిన భారీ కంటెంట్ లైనప్‌ను ప్రకటించి ప్రేక్షకులలో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా తెలుగు ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా పలు క్రేజీ ప్రాజెక్టులను తమ జాబితాలో చేర్చింది.విషయానికి వస్తే, బాలకృష్ణ నటిస్తున్న ఎన్బీకే111, అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా వస్తున్న వెంకీ5, మోహన్‌లాల్ నటిస్తున్న వృషకర్మ వంటి భారీ చిత్రాల థియేట్రికల్ విడుదల తర్వాత తమ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు జీ5 వెల్లడించింది. వీటితో పాటు నివేదా థామస్ ప్రధాన పాత్రలో ‘శ్రీమతి’, శ్రీకాంత్ కీలక పాత్రలో ‘అబ్జెక్షన్ మై లార్డ్’ అనే కొత్త ఒరిజినల్స్‌ను కూడా తీసుకురానుంది.ఈ భారీ లైనప్ కోసం జీ5 దేశంలోని పలు అగ్ర నిర్మాణ సంస్థలతో చేతులు కలిపింది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అలాగే హిందీలో వరుణ్ ధావన్ ‘హై జవానీతో ఇష్క్ హోనా హై’, కంగనా రనౌత్ ‘భారత్ భాగ్య విధాత’, బాబీ డియోల్ ‘బందార్’ వంటి చిత్రాలు రానున్నాయి. తమిళంలో నయనతార ‘హై’, ‘డీ మాంటే కాలనీ 3’ వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సందర్భంగా జీ5 ఉన్నతాధికారులు మాట్లాడుతూ, తాము కేవలం ట్రెండ్స్‌ను ఫాలో అవ్వడమే కాకుండా, కొత్త ట్రెండ్స్ సృష్టిస్తున్నామని తెలిపారు. ప్రేక్షకులకు విభిన్నమైన, సాంస్కృతిక విలువలతో కూడిన కథలను అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం వినోదమే కాకుండా స్పోర్ట్స్, ఏఐ ఆధారిత కథలు, యానిమేషన్ కంటెంట్‌తో సంపూర్ణ వినోద వేదికగా మారుతున్నామని వారు వివరించారు.

## ఓటీటీలోకి తమిళ్ బ్లాక్ బస్టర్ ‘గట్టా కుస్తీ 2’

### - స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!



తమిళ టాలెంటెడ్ నటుడు విష్ణు విశాల్, కథానాయిక ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించిన స్పోర్ట్స్ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘గట్టా కుస్తీ 2ః(మట్టి కుస్తీ) డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి థియేటర్లలో మంచి స్పందనతో బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శించబడిన ఈ చిత్రం, ఇప్పుడు ఓటీటీ ద్వారా ప్రేక్షకులను అలరించడానికి వస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ (చీవ్‌టశ్రీఱఞ) ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను దక్కించుకుంది. ఈ క్రమంలోనే సినిమాను జూలై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారిక ప్రకటించింది. ఈ చిత్రాన్ని కేవలం తమిళ భాషకే పరిమితం చేయకుండా, తెలుగు, కన్నడ, మలయాళ మరియు హిందీ భాషల్లో ఒకేసారి స్ట్రీమింగ్ చేయనున్నారు. దర్శకుడు చెల్లా అయ్యావు దర్శకత్వం వహించిన ఈ సీక్వెల్‌లో సీనియర్ నటి రమ్యకృష్ణ, ప్రముఖ హాస్య నటుడు యోగి బాబు, కరుణాకరన్ తదితరులు కీలక పాత్రల్లో నటించి మెప్పించారు. మొదటి భాగం మాదిరిగానే ఈ రెండో భాగం కూడా థియేటర్లలో మంచి వినోదాన్ని మరియు కుటుంబ భావోద్వేగాలను పంచింది.

## ప్యారడైజ్‌లో ప్రత్యేకగీతం



సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంటాయి. అలాంటి వాటిలో నాని-కీర్తిసురేష్ కాంబో ఒకటి. ఇప్పటికే ఈ జోడీ నేను లోకల్, దసరా వంటి హిట్ చిత్రాల్లో ప్రేక్షకుల్ని అలరించారు. తాజాగా ఈ జంట మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. నాని తాజా చిత్రం ‘ది ప్యారడైజ్’లో కీర్తి సురేష్ ఓ ప్రత్యేకగీతంలో నర్తిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో వేసిన ఓ స్పెషల్ సెట్‌లో ఈ పాటతో పాటు కొన్ని సన్నివేశాలను నాని-కీర్తిసురేష్‌లపై తెరకెక్కిస్తున్నారని సమాచారం. ‘దసరా’ చిత్రంలో పల్లెటూరి అమ్మాయి వెన్నెల పాత్రలో కీర్తిసురేష్ అభినయం అందరిని ఆకట్టుకుంది. నానితో ఆమె కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో మరోమారు ఈ భామ నానితో కలిసి నటిస్తుండటం విశేషం. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ‘ది ప్యారడైజ్’ చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నది. సికింద్రాబాద్ నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు.

# షీ ఈజ్ మై బుజ్జి బ్యూటీ..



మల్టీ టాలెంటెడ్ జీవీ ప్రకాశ్‌కుమార్, కయదు లోహర్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నాచురల్ థ్రిల్లర్ ‘ఇమ్మోర్టల్’. మరియప్పన్ చిన్న దర్శకుడు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ఇప్పటికే విడుదల చేసిన పాటకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. తాజాగా ఈ సినిమా నుంచి రెండో పాటను మంగళవారం విడుదల చేశారు. ‘షీ ఈజ్ మై లవ్లీ ప్రెట్టీ.. షీ ఈజ్ మై బుజ్జి బ్యూటీ.. షీ ఈజ్ మై హాటీ స్వీటీ..’ అంటూ ఆధునిక ధోరణిలో సాగే ఈ పాటను రాజశ్రీ సుధాకర్ రాయగా, సామ్ పీఎస్ స్వరపరిచారు. అరవింద్ శ్రీనివాస్ ఆలపించారు. ఈ పాటలో జీవీ ప్రకాశ్‌కుమార్, కయదు లోహర్‌ల మధ్య కెమిస్ట్రీ ఆసక్తికరంగా ఉంది. యువతరం సంగీత ప్రియులను ఆకట్టుకునేలా ఈ పాటను చిత్రీకరించారని తెలుస్తున్నది. టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, ఆదిత్య కతిర్, అర్ను మహర్జన్, సునీతా శ్రేష్ఠ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ రాధాకృష్ణన్, నిర్మాణం: ఏకే ఫిల్మ్ ఫ్యాక్టరీ.

# భావోద్వేగాల తీరం



ప్రభు, హరిప్రియ జంటగా నటించిన చిత్రం ‘తీరం’. వంశీ మునగాల దర్శకుడు. ఉపేంద్ర గంగావెల్లి నిర్మాత. ప్రస్తుతం నిర్మాణం తుదిదశకు చేరుకున్నది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ‘పుష్ప’ఫేం జగదీశ్, ఫన్ బకెట్ మహేశ్ విట్ట, నటులు రాజ్‌కుమార్ కసిరెడ్డి, దర్శకుడు ప్రసాద్, జబర్దస్త్ సద్దాం ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి పాటను ఆవిష్కరించారు. హృదయాలను తాకే భావోద్వేగభరితమైన కథ ఇదని, ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని దర్శకుడు తెలిపారు. విడుదల తేదీతోపాటు ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తామని నిర్మాత చెప్పారు. అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు హీరోహీరోయిన్లు ప్రభు, హరిప్రియ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అబ్దుల్ వాలి, సంగీతం: సాధ్విక్ సన్స్, నిర్మాణం: శ్రీభవాని క్రియేషన్స్.

# ఎట్టకేలకి రామాయణ ట్రైలర్ రాబోతుంది

## - బ్రహ్మ ముహూర్తంలో రిలీజ్ కానుందంటూ పోస్ట్



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ చిత్రం రామాయణ పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ విజువల్ ఎపిక్‌కు సంబంధించిన ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, కాన్సెప్ట్ విజువల్స్ ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించగా, ఇప్పుడు అందరి దృష్టి ట్రైలర్ రిలీజ్‌పైనే నిలిచింది. మొదట ఈ సినిమా ట్రైలర్‌ను జులై 24, 2026న విడుదల చేయనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే చివరి నిమిషంలో ఆ ప్రణాళిక వాయిదా పడినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ట్రైలర్ ఎప్పుడు విడుదలవుతుందనే ఉత్కంఠ అభిమానుల్లో మరింత పెరిగింది. శుభప్రదమైన బ్రహ్మ ముహూర్తంలో జూలై 30,2026న మా ట్రైలర్‌తో రామాయణ ఆరంభానికి స్వాగతం పలుకుతున్నాము.గురువారం ఉదయం 4.15ని.లకి ట్రైలర్ ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది. సిద్ధంగా ఉండండి అంటూ పోస్ట్ షేర్ చేయగా, ఇది వైరల్ అవుతుంది. నెటిజన్స్ ఈ పోస్ట్‌తో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హాలీవుడ్ దిగ్గజ సంస్థ సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్త డిస్ట్రిబ్యూషన్ భాగస్వామిగా చేరడం సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో మరింత క్రేజ్ తీసుకొచ్చింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో స్టార్ క్యాస్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యష్ రావణుడిగా కనిపించనుండగా, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పురాణ గాథను అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, ప్రపంచ స్థాయి సాంకేతికతతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. దర్శకుడు నితీష్ తివారీ రూపొందిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా, నటుడు యష్ కలిసి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను ఆకాశానికెత్తగా, ట్రైలర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## బోనాల పండుగ శాంతియుతంగా చేయాలి

**- ఇన్స్పెక్టర్ రవి కిరణ్ - అనుమానితులకు కౌన్సిలింగ్ ఇచ్చిన సీఐ**



తార్నాక (ప్రశ్న న్యూస్) రాబోయే బోనాల పండుగను శాంతియుతంగా, అవాంతరాలు లేకుండా జరుపుకునేందుకు తీసుకుంటున్న ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం 28వ తేదీ ఉదయం 10:00 గంటలకు ఇన్స్పెక్టర్ రవి కిరణ్ 15 మంది అనుమానితులకు నివారణ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లాలాగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రవి కిరణ్ నేతృత్వం వహించారు. ఆయన ప్రతి అనుమానితుల జాబితా హోల్డర్‌తో వ్యక్తిగతంగా మాట్లాడారు. పండుగ సమయంలో మంచి ప్రవర్తనను పాటించాలని, చట్టాన్ని గౌరవించాలని, ఎలాంటి చట్టవిరుద్ధమైన, సంఘ వ్యతిరేక, లేదా నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బోనాల పండుగ సమయంలో ఎలాంటి నేరపూరిత కార్యకలాపాలలో పాల్గొన్నా, శాంతికి భంగం కలిగించినా, లేదా ప్రజా భద్రతకు భంగం కలిగించినా చట్ట ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనుమానితులకు గట్టిగా హెచ్చరించారు.

## దొంగ తనం కేసులో మంథని మాజీ జెడ్పిటిసి భర్త..?

- కరీంనగర్ పోలీసుల అదుపులో నిందితుడు?
- అటవీ శాఖ అధికారి ఇంట్లో చోరీ.
- చోరీ కేసు పై విచారణ.
- మంథని ప్రాంతంలో తీవ్రమైన చర్చ
- బిఆర్ఎస్ పార్టీ నాయకుడు.
- పుట్ట మధు అనుచరుడు.




మంథని ( ప్రశ్న న్యూస్) కరీంనగర్ లో జరిగిన ఓ చోరీ కేసులో మంథని మండలం కు చెందిన ఓ మాజీ జెడ్పిటిసి భర్తను కరీంనగర్ కు చెందిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు మాజీ ప్రజా ప్రతినిధి కరీంనగర్లో గత నెలలో ఓ ఇంట్లో ఒకరోజు ఉండిపోయాడు .కాగా అతను ఆ ఇంట్లో షెల్టర్ తీసుకొని ఆ ఇంటి యజమానికే కుచ్చుటోపి పెట్టాడు ఇది తెలుసుకున్న ఆ ఇంటి యజమాని ఇంటికి వచ్చి నగదు చూసుకునేసరికి లేకపోవడంతో అవాక్ అయ్యాడు. ఆయనకు తెలిసిన సమాచారం ప్రకారం ఎవరు ఏంది అని ఆరా తీయగా మంథని ప్రాంతానికి చెందిన మాజీ జెడ్పిటిసి భర్తని తెలుసుకున్నాడు. ఆయనకు జరిగిన అన్యాయాన్ని పోలీసుల వద్దకు వెళ్లి వారికి వివరంగా సమాచారం ఇచ్చాడు. దీనిపై పోలీసులు సదర్ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం దీనితో మంథని ప్రాంతంలో రాజకీయ వర్గాల్లో సామాన్య ప్రజల్లో తీవ్ర మైన చర్చ. టి హోటల దగ్గర, నలుగురు కూర్చున్న కాడ బస్టాండ్లలో అదే చర్చ జరుగుతుంది.

## గురుపౌర్ణమి సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, న్యాయవాది ఎన్.వి. అనంత కృష్ణకు ఘన సత్కారం



ఉప్పల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఎండోమెంట్ (ధార్మిక) సెల్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రముఖ న్యాయవాది, విద్యావేత్త ఎన్.వి. అనంత కృష్ణ (అడ్వకేట్) ని జిల్లా కన్వీనర్ బలిజపల్లి చంద్రమౌళి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాజపా సీనియర్ నాయకులు జిల్లెల రవీందర్ రెడ్డి పాల్గొని అనంత కృష్ణ విద్యా సేవలను అభినందించారు. గురువు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, విద్య ద్వారా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఎన్.వి. అనంత కృష్ణ ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్తగా విశేష గుర్తింపు పొందారు. ఆన్‌లైన్ ద్వారా దాదాపు 850 మంది విద్యార్థులకు ఉచితంగా బోధిస్తూ, వారి ఉన్నత విద్యాభ్యాసానికి మార్గనిర్దేశనం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు బోధిస్తూ, 16 సబ్జెక్టులను ఉచితంగా బోధించడం ద్వారా విద్యా సేవను సమాజ సేవగా కొనసాగిస్తున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఇలాంటి మహోన్నత విద్యా సేవకులను సత్కరించడం స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పాల్గొన్నవారు కొనియాడారు.

# కాలుష్య నీటితో పంటలు నాశనం..
# అంకిరెడ్డిపల్లి రైతుల ఆవేదన

**అంకిరెడ్డిపల్లిలో కంపెనీ వ్యర్థ జలాలతో వ్యవసాయానికి నష్టం.. పరిశీలించి పరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్**



కీసర(ప్రశ్న న్యూస్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 812లో ఉన్న ఈ పవర్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి విడుదలవుతున్న కాలుష్య నీటి వల్ల తమ పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు వ్యవసాయ పొలాల్లోకి చేరడంతో పంటలు ఎండిపోవడం, దిగుబడి తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. ఈ కాలుష్య



నీటి ప్రభావంతో భూమి సారవంతత కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత



అధికారులు వెంటనే ఘటనాస్థలాన్ని పరిశీలించి కాలుష్య నీటి నమూనాలను పరీక్షించాలని రైతులు కోరారు. పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు తగిన పరిహారం అందించడంతో పాటు, భవిష్యత్తులో కాలుష్య నీరు పొలాల్లోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను రైతులు డిమాండ్ చేశారు.

# మారుమూల గిరిజన సేవలకు జాతీయ గుర్తింపు

**మనం వెల్ఫేర్' చౌలం శ్రీనివాసరావుకు 'దక్షిణ భారత సిఎస్ఆర్ పురస్కారం.**

ములుగు(ప్రశ్న న్యూస్) హైదరాబాద్, గచ్చిబౌలిసేవయే ఊపిరి, మమతయే మార్గంగా 38 ఏళ్లుగా మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యా, వైద్య, పర్యావరణ సేవలు అందిస్తున్న ములుగు జిల్లా 'మనం వెల్ఫేర్ సొసైటీ'కి అరుదైన జాతీయ గుర్తింపు లభించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి శాంతి సరోవర్ బ్రహ్మ కుమారీస్ అకాడమీలో ఆదివారం జరిగిన '3వ దక్షిణ భారత సి ఎస్ ఆర్ సదస్సు అవార్డుల ప్రదానోత్సవం'లో సంస్థ వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చౌలం శ్రీనివాసరావుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. బ్రహ్మ కుమారీస్ తెలంగాణ డైరెక్టర్ బి.కె. కుల్‌దీప్ దీదీ రాజయోగిని చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్న శ్రీనివాసరావు భావోద్వేగానికి లోనయ్యారు.




### ఇది అందరి కృషికి దక్కిన గౌరవం.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, బి"ఈ పురస్కారం నా ఒక్కడిది కాదు. 38 ఏళ్లుగా మాతో కలిసి నడిచిన ఉపాధ్యాయ మిత్రులు, అధికారులు, వాలంటీర్లు, శ్రేయోభిలాషులు ప్రియమైన విద్యార్థులందరి త్యాగానికి, కృషికి దక్కిన గౌరవం ఇది. ఆరోగ్య, కంటిచూపు సవాళ్లు ఉన్నా సమాజ శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు సాగుతాం. మారుమూల గిరిజన బిడ్డల జీవితాల్లో వెలుగు నింపడమే మా లక్ష్యం అని అన్నారు.

### సదస్సు సామాజిక బాధ్యతకు వేదిక.

ఈ సదస్సుకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండి అజారుద్దీన్, తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు శాసనసభ్యులు, సి ఎస్ ఆర్ జ్యూరీ డైరెక్టర్ ఆర్. పూర్ణిమ రావు, లైసెన్సీ ఏం డి అడుదోడ్ల అనిల్ రెడ్డి, బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌర్య రెడ్డి సింగారెడ్డి తోపాటు రాష్ట్రంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థల సి ఎస్ ఆర్ ప్రతినిధులు హాజరయ్యారు. వర్తమాన పర్యావరణ, సామాజిక సమస్యలపై చర్చించి, భావితరాల భవిష్యత్తు కోసం కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### మనం' 38 ఏళ్ల ప్రయాణం.

1987 నుంచి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘనపూర్‌ను కేంద్రంగా చేసుకుని 'మనం వెల్ఫేర్ సొసైటీ' కార్యకలాపాలు సాగిస్తోంది.
విద్య: బడి బాట కార్యక్రమాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కోసం ప్రచారం
ఆరోగ్యం : ఉచిత వైద్య, కంటి శిబిరాలు, యోగా, వందేమాతరం ఆరోగ్య సేవలు
పర్యావరణం : హరితహారం, ప్లాస్టిక్ నియంత్రణ ర్యాలీలు, సేంద్రీయ జీవనంపై అవగాహన

### విపత్తు సేవలు.

ఏటూరునాగారం వరదలు, శనగకుంట అగ్ని ప్రమాద సరుకుల పంపిణీ, కోవిడ్ సమయంలో ఆహారం, నీరు పంపిణీ, మేడారం జాతరలో వాలంటీర్ సేవలు ప్రభుత్వంతో సమన్వయం చేసి పునరావాస ప్రాంతాలకు వసతుల కల్పన, మేధావుల దినోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సామాజిక అవగాహన కల్పిస్తున్నారు.

### సి ఎస్ ఆర్ సాయం కోసం విజ్ఞప్తి.

అవార్డు వేదికగా ఆయన కార్పొరేట్ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. బి"గిరిజన ప్రాంతాల్లో చాలా ఆశ్రమ పాఠశాలలు మూతపడే స్థితిలో ఉన్నాయి. యువతకు నైపుణ్య శిక్షణ, మహిళా సాధికారత, విపత్తు సేవలను నిరంతరాయంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఆర్థిక వనరుల కొరత అడ్డంకిగా మారింది. సిఎస్ఆర్ నిధులు, పరికరాలు అందిస్తే ప్రతి రూపాయిని అత్యంత పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులకు చేరుస్తాం అని కోరారు.
సమావేశం చివర్లో మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ఈ గుర్తింపు తమ ప్రాంత అభ్యున్నతికి మరింత ఉత్సాహాన్నిస్తుందని ఆయన అన్నారు.

# వాడవాడల్లో గురు పౌర్ణమి వేడుకలు

**- సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యేలు**
**- చామకూర మల్లారెడ్డి, మర్రి - రాజశేఖర్ రెడ్డి**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) గురు పౌర్ణమి వేడుకలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వాడవాడలో నిర్వహించారు. మేడ్చల్ గురు పౌర్ణమి పర్వదిన సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మేడ్చల్ లోని సాయిబాబా ఆలయంలో సాయిబాబాను దర్శించుకున్నారు. మేడ్చల్ పట్టణంలో గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. సాయి బాబా ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని,వానలు బాగా కురవాలని బాబా నీ వెడుకున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో మేడ్చల్ మున్సిపాలిటీ పుర ప్రముఖులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

### మల్కాజ్గిరి సాయి నగర్ కాలనీలో...

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈరోజు మల్కాజ్‌గిరి సాయి నగర్‌లోని శ్రీ సాయి బాబా దేవాలయంలో శ్రీ సాయి సమాజం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ సాయిబాబా ను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. గురువు మార్గదర్శకత్వం సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గారిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కల్పన మమతా రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల సునీత, రాము యాదవ్, శిరీష జితేందర్ రెడ్డి, ఆలయ కమిటీ



సభ్యులు వీరేశం యాదవ్, మల్లేష్ గౌడ్, శ్రీ లింగారెడ్డి, అశోక్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి,జేఏసీ వెంకన్న, మురిగేష్, నర్సింగరావు, శ్రీరాములు, కిట్టు, శ్రీ రాములు చంద్ర మౌళి, బాలకృష్ణ, స్థానిక భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సాకేత్ ప్రణామమ్‌లో

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని సాకేత్ ప్రణామమ్‌లో గురు పౌర్ణమి (ఆషాఢ పౌర్ణమి) వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. వేదాలను వర్గీకరించి మానవాళికి అందించిన మహర్షి వేద వ్యాసుని జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకుడు చేదెళ్ల ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ గురు పౌర్ణమి విశిష్టతను వివరించారు. "మానసిక దృక్పథంలో, చంద్రుని పౌర్ణమి కాంతి మానవ మెదడుపై, ఆలోచనలపై సానుకూల ప్రభావం చూపుతుందని, అధ్యయనానికి ఇది సరైన సమయమని విశ్వసిస్తారని" ఆయన తెలిపారు. గురువు ప్రాముఖ్యతను, వారు చూపిన బాటలో నడవాల్సిన ఆవశ్యకతను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం, నివాసితులందరికీ పసందైన విందు భోజనాలను ఏర్పాటు చేశారు.
ఈ విందు భోజనాల ఏర్పాటుకు సతీష్ రాజు సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.
ఈ వేడుకల్లో నిర్వాహకులు, నివాసితులు విజయ్ కుమార్, నిరంజన్ రావు, కె.బి.ఎస్. ప్రసాద్, దిలీప్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తిభావంతో గురు పౌర్ణమిని జరుపుకున్నారు

# హైడ్రా కమిషనర్‌కే వేధింపులు ఉంటే

# సామాన్య జర్నలిస్టుల పరిస్థితి ఏమిటి.?

- అన్ని శాఖల సహకారం ఉండే హైడ్రా కె భూ మాఫియా వత్తిడి - సాధారణ రిపోర్టర్లు అనేక రకాల మాఫియాలను ఎలా ఎదుర్కొంటున్నారో
- వాస్తవాలను రాసినందుకు తప్పుడు కేసులను ఎదుర్కొనలేకపోతున్న జర్నలిస్టులు
- ఎవిడెన్స్, ప్రాథమిక విచారణ లేకుండానే ఎఫ్ఐఆర్‌లా.? - వాస్తవాలను, అవినీతి, అక్రమాలను తప్పుడు కేసుల భయంతో వెలుగులోకి తీసుకు రాలేకపోతున్న రిపోర్టర్లు

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా వ్యవస్థ కూడా ఇప్పుడు భూ మాఫియాల కుతంత్రాలకు తట్టుకోలేకపోతుందన్న చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఉన్నత అధికారులే తమ విధులు నిర్వర్తించే క్రమంలో న్యాయపరమైన వివాదాలు, ఫిర్యాదులు, కేసులను ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తే, ఎలాంటి అధికారిక రక్షణ లేకుండా ప్రజా సమస్యలను, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తున్న సాధారణ జర్నలిస్టుల పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్న తీవ్రంగా వినిపిస్తోంది.

### భూ మాఫియాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న హైడ్రా వ్యవస్థ

ప్రభుత్వ అధికారాలు, పోలీసు భద్రత, న్యాయపరమైన సహకారం ఉన్నప్పటికీ భూ మాఫియాలపై చర్యలు తీసుకునే అధికారులకు అనేక రకాల ఒత్తిళ్లు, బెదిరింపులు, విమర్శలు ఎదురవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాల తొలగింపు, ప్రభుత్వ భూముల రక్షణ, ఆక్రమణలపై చర్యలు తీసుకునే క్రమంలో ఫిర్యాదులు, కోర్టు కేసులు, వ్యక్తిగత ఆరోపణలు ఎదురవుతున్న పరిస్థితులు చర్చనీయాంశమవుతున్నాయి. అయితే ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అనేక అవినీతి అక్రమాలను వెలికితీస్తున్న రిపోర్టర్ల పై ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు మరి వాటిని వాస్తవాలు రాసే రిపోర్టర్లు ఎలా ఎదుర్కోవాలి.

### సామాన్య జర్నలిస్టులు మాఫియాలను ఎలా ఎదుర్కొంటారు సార్

ప్రజల తరపున అవినీతి, అక్రమాలు, భూ దందాలు, ఇసుక మాఫియా, ఆహార కల్తీ మాఫియా, డ్రగ్స్ మాఫియా, లిక్కర్ మాఫియా, నకిలీ వ్యాపారాలు వంటి అనేక అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చేది ఎక్కువగా జర్నలిస్టులే. అయితే వారికి అధికార యంత్రాంగం లాంటి రక్షణ ఉండదు. అయినప్పటికీ ప్రజా ప్రయోజనం కోసం నిజాలను బయటపెట్టే పరిస్థితులలో చాలామందిపై ప్రాథమిక విచారణ లేకుండా, పూర్తిస్థాయిలో సాక్షాధారాలు లేకుండానే అక్రమ కేసులు క్షణాలలో పెడుతున్నారు పోలీసు అధికారులు అలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులపై తప్పుడు ఫిర్యాదులు, రాజకీయ, మాఫియాల బెదిరింపులు వస్తే వారు ఎలా నిలబడగలరనే ప్రశ్న ప్రభుత్వానికి పోలీసు ఉన్నత అధికారులకు ఎందుకు రావడం లేదో.?

### అవినీతి, అక్రమాలను బయటపెడితే అక్రమ కేసులేనా.?

అనేక సందర్భాల్లో అవినీతి లేదా అక్రమాలపై కథనాలు ప్రచురించిన అనంతరం సంబంధిత వ్యక్తుల నుంచి జర్నలిస్టులపై తప్పుడు ఫిర్యాదులు నమోదు అవుతున్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే తమ బాధ్యతగా భావించే రిపోర్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు కావడం పత్రికా స్వేచ్ఛకు సవాలుగా మారుతోందని మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జర్నలిస్టులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు పోలీసు అధికారులు ప్రాథమిక ఆధారాలు, ప్రాథమిక విచారణ లేకుండానే ఆగమేఘాలమీద కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసము వాళ్లకే తెలియాలి.



### ప్రభుత్వ సహకారం ఉన్న అధికారులకే ఇబ్బందులు

ప్రభుత్వ ఉద్యోగం, చట్టపరమైన అధికారాలు, పోలీసు రక్షణ, ప్రభుత్వ న్యాయ సహాయం వంటి వ్యవస్థలు ఉన్న అధికారులకే అవినీతి అక్రమాలను కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నందుకు అక్రమ కేసులు, ఒత్తిళ్లు ఎదురవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అలాంటప్పుడు ఎలాంటి అధికారిక రక్షణ లేకుండా పనిచేసే ఫ్రీలాన్స్, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి జర్నలిస్టులు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రం మంత్రులు, పోలీసు కమిషనర్లు ఉన్నత అధికారులు అర్థం చేసుకోవాలని జర్నలిస్ట్ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

### జర్నలిస్టులకు రక్షణ ఎక్కడ.?

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ జీతం లేదు, పోలీసు భద్రత అసలే లేదు, న్యాయపరమైన సహాయం కూడా దొరకనే దొరకదు. అవినీతి, అక్రమాలను, వాస్తవాలను రాసినందుకు చాలా సందర్భాల్లో జర్నలిస్టులు అన్ని సమకూర్చుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ ప్రజా ప్రయోజనం కోసం ప్రమాదాలను, బెదిరింపులను, దాడులను లెక్కచేయకుండా వార్తలను అందిస్తున్నారు.

### ప్రాథమిక విచారణ లేకుండానే ఎఫ్ఐఆర్‌లా.?

జర్నలిస్టులపై ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు అధికారులకు రిపోర్టర్లు అంటే ఎందుకు అంత కోపం,పగనో కాని ప్రాథమిక విచారణ చేయకుండానే సాక్షాధారాలు లేకున్నా క్షణాలలో కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకులు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు రిపోర్టర్ల పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడమే డ్యూటీ గా కొంతమంది పోలీసు అధికారులు పెట్టుకున్నారు ఏమో.? చాలా సంఘటనలపై కూడా సందేహాలు తలెత్తుతున్నాయని మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాలపై పారదర్శక విచారణ అవసరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు కోరుతున్నారు.

### మాఫియాలను అరికట్టలేకపోతున్న వ్యవస్థ

భారీ అధికార యంత్రాంగం, ప్రత్యేక విభాగాలు, పోలీసు బలగాలు ఉన్నప్పటికీ భూ మాఫియా, ఇసుక మాఫియా, ఇతర అక్రమ నెట్‌వర్క్‌లను పూర్తిగా అరికట్టడం ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది. అలాంటి పరిస్థితుల్లో ఒక జర్నలిస్టు ఒంటరిగా వాటిని ఎదుర్కోవడం ఎంతటి కష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని దీనిని పోలీసు ఉన్నత అధికారులు అర్థం చేసుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు పేర్కొంటున్నారు.

### తప్పుడు కేసుల భయంతో తగ్గుతున్న దర్యాప్తు కథనాలు

వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులపై చాలావరకు తప్పుడు కేసులు, బెదిరింపులు పెరుగుతున్నాయనే అభిప్రాయం మీడియాలో బలంగా ఉంది. దీంతో అనేక మంది ఇన్వెస్టిగేషన్ జర్నలిస్టులు, రిపోర్టర్లు దర్యాప్తు కథనాలను అందించడంలో వెనుకంజ వేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి, ప్రజలకు తెలియాల్సిన అనేక కీలక అంశాలు, వాస్తవాలు వెలుగులోకి రాకపోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### పత్రికా స్వేచ్ఛకు రక్షణ అవసరం

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుత మీడియా కీలకమైన స్తంభంగా భావిస్తారు. అవినీతి, అక్రమాలు, మాఫియాలపై వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులు చట్టపరమైన ఇబ్బందులు, తప్పుడు కేసులు, దాడులు, బెదిరింపులకు గురికాకుండా ఉండేలా తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని మీడియా వర్గాలు, పౌరసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. నిజాలను వెలుగులోకి తీసుకురావడం నేరంగా మారితే ప్రజాస్వామ్య వ్యవస్థకే అది ఆందోళనకర పరిణామం మరి దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, డిజిపి, పోలీసు ఉన్నత అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం.

# ఇన్‌స్టాలో పరిచయం, ప్రేమ..

# ట్రైనింగ్‌లో బెదిరింపులు, వేధింపులు

- ఉదయ్ కృష్ణారెడ్డి కేసుపై సీపీ సజ్జనార్
- కేసు వివరాలు వెల్లడించిన హైదరాబాద్ సీపీ
- నిందితుడు గతంలో కానిస్టేబుల్‌గా పని చేసినట్లు వెల్లడి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్ వ్యవహారంపై హైదరాబాద్ సిటీ పోలీసులు కీలక వివరాలు వెల్లడించారు. లైంగిక వేధింపులు, స్టాకింగ్, బెదిరింపుల ఆరోపణల కేసులో అరెస్టైన ఉదయ్ కృష్ణారెడ్డిని కోర్టు ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు పంపించారు. ఈ కేసు దర్యాప్తు వివరాలను హైదరాబాద్ సీపీ సీవీ సజ్జనార్ కీలక వివరాలు తెలిపారు. సీపీ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసి ఆ తర్వాత యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణత సాధించి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు.ప్రస్తుతం శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ ట్రైనింగ్ పొందుతున్నారు. 2025లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధిత మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణితో ఉదయ్ కృష్ణారెడ్డికి పరిచయం ఏర్పడినట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ క్రమంలోనే గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఉదయ్ కృష్ణారెడ్డి 2025 యూపీఎస్సీ పరీక్షల్లో ఎంపికై ఐపీఎస్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ఈ క్రమంలోనే తన సక్సెస్ జర్నీకి సంబంధించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఉదయ్ కృష్ణారెడ్డి పోస్ట్ పెట్టగా దానికి ఆ మహిళా ట్రైనీ ఐపీఎస్ స్పందించడంతో వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది.అయితే తాను కూడా 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యానని చెప్పిన ఆ మహిళ ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్(ఈఓఎల్)లో ఉండటంతో 2025 బ్యాచ్‌తో కలిసి ట్రైనింగ్ తీసుకోనున్నట్లు వెల్లడించింది. అయితే ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని తెలిపారు. ఐపీఎస్ ట్రైనింగ్ సమయంలో వారిద్దరి మధ్య తరచూ విభేదాలు తలెత్తాయని గొడవలు జరిగేవని పేర్కొన్నారు. ఆ తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డి తాను సూసైడ్ చేసుకుంటానని బెదిరించడం బాధితురాలి ల్యాప్‌టాప్‌ను ధ్వంసం చేయడం ఆమె బ్లాక్ చేసిన తర్వాత ఫేక్ సోషల్ మీడియా అకౌంట్లు ఓపెన్ చేయడం, వారి మధ్య జరిగిన పర్సనల్ చాట్‌లను బయటపెడతానని బెదిరించడం చేసినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.అంతేకాకుండా కుటుంబ సభ్యులు, సహచరులను



అనుమతి లేకుండా సంప్రదించడం వంటి చర్యలకు ఉదయ్ కృష్ణారెడ్డి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సజ్జనార్ వెల్లడించారు. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు ఉదయ్ కృష్ణారెడ్డితో రిలేషన్ కట్ చేసిందని ఆ తర్వాత ఆమె మరో వ్యక్తిని పెళ్లి చేసుకున్నప్పటికీ వేధింపులు కొనసాగినట్లు పేర్కొన్నారు.

# ఎర్ర చెరువుకు ఎసరు.?

-పంట పొలాలలోకి వరద నీరు రాకుండా ఉండేందుకు చెరువులో నింపిన మట్టి
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా పూడూరు ఎర్ర చెరువుకు అలుగు పారకుండా అడ్డంగా మట్టిని పోశారు. ఇదే తరహాలో గతంలో రాజ బొల్లారం రావల్ కోల్ గ్రామాల మధ్య ఉన్న బంధన్ కుంట చెరువుకు అలుగు పారకుండా పెద్ద పెద్ద బండారాలను అడ్డంగా పెట్టారు. ఇదే తరహాలో పూడూరు ఎర్ర చెరువు అలుగు పారకుండా అడ్డంగా మట్టి పోశారు. గత సంవత్సరం లోను ఎర్ర చెరువుకు అలుగు పారకుండా జెసిబి సహాయంతో మట్టి తవ్వకాలు చేపట్టారు. ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు తవ్విన మట్టి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించారని రైతులు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే తరహాలో ఈ సంవత్సరం సైతం వర్షాలు కురుస్తున్న సమయంలో ఎర్ర చెరువు నిండి అలుగు పారకుండా ఉండేందుకు చెరువు పక్కన ఉన్న భూమి యజమాని చెరువుకు అడ్డంగా మట్టిబోసినట్లు సమాచారం. ప్రస్తుతం చెరువులో నీరు లేకపోవడంతో చెరువుకు మట్టి పోసి అలుగు పారకుండా అడ్డుకున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. మరికొందరు రైతుల కథనం మరో లాగా ఉంది. సదరు రైతు పశువుల కొట్టం చెరువు పక్కనే ఉన్నందున అక్కడికి వెళ్లేందుకు మట్టి పోసి దారి చేసుకున్నారని తెలిపారు.




### చెరువులను పరిరక్షించాలి

మనుషులకు జీవనాధారమైన చెరువులను పరిరక్షించాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులపై ఉందని, వారు చెరువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు. చెరువులను కబ్జాలు చేయడం, ఇలా అలుగు పారకుండా అడ్డంగా మట్టి పోయడం , చెరువులో నుండి మట్టి తవ్వకాలు చెప్పడం వంటి సంఘటనలు జరుగుతున్న దృష్ట్యా ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై చెరువులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## నల్లమలలో పులి గాండ్రింపు

# శాశ్వతం చేస్తాం

- పులుల సంరక్షణలో ఏపీని ఆదర్శంగా నిలుపుతామన్న డిప్యూటీ సీఎం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కీలక ప్రకటనలు చేశారు. నల్లమల అడవుల్లో పులి గాండ్రింపును శాశ్వతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పులుల సంరక్షణలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తూర్పు కనుమల్లో పులుల పునరుజ్జీవానికి చారిత్రక అడుగులు వేస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన స్పందిస్తూ జీవ వైవిధ్య పరిరక్షణలో పులుల పాత్ర అమోఘమని అన్నారు. పులులను కాపాడుకోవడం అంటే అడవులను, జలవనరులను, భావితరాల వారసత్వాన్ని కాపాడుకోవడమేనని పేర్కొన్నారు. తూర్పు కనుమల ప్రాంతంలో పులుల సంఖ్యను, జన్యు వైవిధ్యాన్ని పెంచేందుకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి నాలుగు ఆడ పులులను రాష్ట్రానికి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం తెలిపిందని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇందుకు సహకరించిన కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇది రాష్ట్ర పులుల సంరక్షణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అభివర్ణించారు.పులుల సంరక్షణ చర్యలను మరింత బలోపేతం చేసేందుకు దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్ అయిన నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్ టీఆర్) పరిధిలో వేట నిరోధక శిబిరాల సంఖ్యను 89 నుంచి 150కి పెంచుతున్నట్లు ప్రకటించారు. దీని ద్వారా నిఘా వ్యవస్థ పటిష్ఠం కావడంతో పాటు, సుమారు 800 మంది గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. రాష్ట్రంలోని ఎన్ఎస్ టీఆర్–శేషాచలం అటవీ ప్రాంతాల్లో ప్రస్తుతం 68 పులులు, 11 పులి పిల్లలు ఉన్నాయని, ఇది ప్రభుత్వ సంరక్షణ చర్యలకు నిదర్శనమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పులుల సంరక్షణకు శాస్త్రీయ పద్ధతులను అమలు చేస్తున్నామని, డ్రోన్లు, కెమెరా ట్రాప్‌లతో నిఘాను పటిష్ఠం చేశామని తెలిపారు. నల్లమల అడవుల్లో గౌర్ (అడవి దున్న) జంతువుల పునఃప్రవేశం, పాపికొండల అటవీ ప్రాంతంలో ఆడ పులుల ప్రవేశం వంటి కార్యక్రమాలను కూడా ముందుకు తీసుకెళ్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గిరిజన సమాజాలు, పర్యావరణ ప్రేమికులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆసియా టాప్-50 బార్ల జాబితాలో భారత్

- టాప్-10లో గోవా బార్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఆసియాలోని అత్యుత్తమ బార్ల జాబితాలో భారత్ మరోసారి తన సత్తా చాటింది. ప్రతిష్ఠాత్మక 'ఆసియాస్ 50 బెస్ట్ బార్స్ 2026' ర్యాంకింగ్స్‌లో మూడు భారతీయ బార్లు చోటు దక్కించుకున్నాయి. ఇందులో గోవాకు చెందిన 'బాయిలర్‌మేకర్' టాప్–10లో నిలవగా, బెంగళూరుకు చెందిన రెండు బార్లు ఈ జాబితాలో స్థానం సంపాదించి, కాక్‌టెయిల్ రంగంలో ఆ నగరం యొక్క ప్రాధాన్యతను చాటాయి. మకావులోని విన్ ప్యాలెస్ వేదికగా జూలై 28న జరిగిన కార్యక్రమంలో ఈ ర్యాంకులను ప్రకటించారు. ఈ జాబితాలో గోవాలోని బాయిలర్‌మేకర్ 8వ స్థానంలో నిలిచి 'బెస్ట్ బార్ ఇన్ ఇండియా' అవార్డును కైవసం చేసుకుంది. ఇక బెంగళూరుకు చెందిన 'సోకా' 18వ స్థానంలో, 'బార్ స్పిరిట్ ఫార్వర్డ్' 30వ స్థానంలో నిలిచాయి. చైనాలోని గ్వాంగ్‌జౌకు చెందిన 'హోప్ ఓ సెసేమ్' ప్రథమ స్థానంలో నిలిచి 'బెస్ట్ బార్ ఇన్ ఏషియా' టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ ఘనత సాధించిన చైనాలోని తొలి బార్ ఇదే కావడం విశేషం.గోవా సంస్కృతిని ప్రతిబింబించే బాయిలర్‌మేకర్, బీచ్ షాక్, క్రాఫ్ట్ బీర్లతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక బెంగళూరులోని సోకా తన ఆధునిక డిజైన్, వినూత్న కాక్‌టెయిల్‌లతో ఆకట్టుకుంటుండగా, బార్ స్పిరిట్ ఫార్వర్డ్ క్లాసిక్ కాక్‌టెయిల్‌లతో విభిన్నమైన అనుభూతిని అందిస్తోంది. గతేడాది ఈ జాబితాలో ఐదు భారతీయ బార్లు ఉన్నప్పటికీ, ఈసారి టాప్ 10లో ఒకటి నిలవడం గమనార్హం. బెంగళూరు నుంచి రెండు బార్లు ఎంపికవడం ఆ నగరం కాక్‌టెయిల్ హబ్‌గా మారుతోందనడానికి నిదర్శనంగా నిలిచింది. ఇక టాప్–50 జాబితాలో బ్యాంకాక్ కు చెందిన 8 బార్లు, హాంగ్‌కాంగ్ కు చెందిన 7 బార్లు స్థానం సంపాదించడం విశేషం.

## ఫ్యూయల్ స్విచ్‌లో లోపం లేదు

- ఎయిరిండియా ప్రమాదంపై ప్రభుత్వం కీలక ప్రకటన



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అహ్మదాబాద్‌లో గతేడాది జూన్ 12న కుప్పకూలిన ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ ప్రమాదంపై దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ ప్రమాదంలో విమానంలోని ప్రయాణికులు, సిబ్బందితో పాటు నేలపై ఉన్నవారూ కలిపి 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటిపై నిర్వహించిన అధునాతన పరీక్షల్లో ఎలాంటి సాంకేతిక లోపం గుర్తించలేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌కు తెలిపింది. రాజ్యసభలో కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ ఈ వివరాలు వెల్లడించారు. ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌ను తయారీ సంస్థ వద్ద సమగ్రంగా పరీక్షించగా, లాకింగ్ వ్యవస్థలో అసాధారణంగా ఏమీ కనిపించలేదన్నారు. డీజీసీఏ ఆదేశాల మేరకు విమాన భద్రతా తనిఖీల్లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.అయితే పూర్తి స్థాయి థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్ పరిశీలన ఇంకా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అమెరికాలోని సియాటిల్‌లో ఉన్న తయారీ కేంద్రంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పరీక్షల ఫలితాల కోసం దర్యాప్తు అధికారులు ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. ఈ ప్రమాదంపై విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తుది నివేదిక ఆలస్యమైందన్న విమర్శలను కూడా ప్రభుత్వం తోసిపుచ్చింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తునకు నిర్దిష్ట కాలపరిమితి ఉండదని స్పష్టం చేసింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలను పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తయిన వెంటనే తుది నివేదికను ఏఏఐబీ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588